సిటీ పోలీస్ కమిషనర్‌గా శంక బ్రత బాగ్చి

▸▸ సీఐడీ ఏడీజీగా రవిశంకర్ అయ్యన్నార్ బదిలీ



శంక బ్రత బాగ్చి



రవిశంకర్ అయ్యన్నార్

విశాఖపట్నం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): విశాఖ నగర సిటీ పోలీస్ కమిషనర్ డాక్టర్ రవిశంకర్ అయ్యన్నార్‌ను ప్రభుత్వం శుక్రవారం బదిలీ చేసింది. ఆయన స్థానంలో రాష్ట్ర శాంతి భద్రతల విభాగం అడిషనల్ డైరెక్టర్ జనరల్‌గా పనిచేస్తున్న డాక్టర్ శంక బ్రత బాగ్చిని నియమించింది. రవిశంకర్ అయ్యన్నార్‌కు కీలకమైన సీఐడీ ఏడీజీగా నియమించింది.

గత ఏడాది సెప్టెంబరు 14న నగర పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన రవిశంకర్ అయ్యన్నార్‌కు బదిలీ కానున్నదనే ప్రచారం ప్రభుత్వం మారినప్పటి నుంచి జరుగుతోంది. ఎన్నికల సమయంలో వైసీపీ నేతల కార్యక్రమాలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అనుమతులు మంజూరుచేసి, కూటమి నేతల సభలు, కార్యక్రమాలకు


... మిగతా 6వ పేజీలో

నేడు స్పీకర్ అయ్యన్నపాత్రుడు రాక



విశాఖపట్నం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు శనివారం నగరానికి రానున్నారు. సభాపతిగా బాధ్యతలు చేపట్టిన తరువాత తొలిసారిగా జిల్లాకు వస్తుండడంతో ఘనంగా స్వాగతం పలికేందుకు తెలుగు దేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆయన శనివారం ఉదయం గన్నవరం విమానాశ్రయంలో బయలుదేరి పది గంటలకు విశాఖపట్నం చేరుకుంటారు. ఎయిర్‌పోర్టు నుంచి నేరుగా దసపల్లా హోటల్‌కు వెళతారు. అక్కడ ఆయన్ను నగర ప్రముఖులు, అధికారులు, టీడీపీ నాయకులు కలవనున్నారు. మధ్యాహ్నం భోజనం చేసిన తరువాత అనకాపల్లి వెళ్లి నూకాంబికా అమ్మవారిని దర్శించుకుంటారు. అక్కడ నుంచి నర్సీపట్నం వెళతారు.

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా పల్లా బాధ్యతలు స్వీకారం



పల్లాను అభినందిస్తున్న పార్టీ జాతీయ కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్, ఇతర నాయకులు

తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షునిగా గాజువాక శాసన సభ్యుడు పల్లా శ్రీనివాసరావు శుక్రవారం మంగళగిరిలోని కేంద్ర కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి మానవ వనరులు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌తో పాటు పలువురు మంత్రులు, శాసన సభ్యులు, నాయకులు హాజరై పల్లా శ్రీనివాసరావుకు అభినందనలు తెలిపారు. - విశాఖపట్నం



మాట్లాడుతున్న పల్లా శ్రీనివాసరావు

ఏయూ వీసీ అవుట్

రిజిస్ట్రార్ జేమ్స్ కూడా...

విద్యార్థి, అధ్యాపక సంఘాల ఆందోళనలతో ఎట్టకేలకు రాజీనామా

- ▸▸ రాష్ట్రంలోనే వివాదాస్పద వీసీగా పేరుగాంచిన ప్రొఫెసర్ పీవీజీడీ ప్రసాదరెడ్డి
- ▸▸ వర్సిటీని వైసీపీ కార్యాలయంగా మార్చారనే విమర్శలు

విశాఖపట్నం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పీవీజీడీ ప్రసాదరెడ్డి, ఆయన అనుంగ శిష్యుడు రిజిస్ట్రార్ జేమ్స్ స్టీఫెన్‌లు శుక్రవారం తమ పదవులకు రాజీనామా చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారినప్పటి నుంచి వీసీ, రిజిస్ట్రార్ రాజీనామా చేయాలంటూ వర్సిటీలో నిరశన దీక్షలు కొనసాగుతున్నాయి. ప్రసాదరెడ్డి, జేమ్స్ స్టీఫెన్‌ను తొలగించాలంటూ ఏయూ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో విద్యార్థి సంఘాల ప్రతినిధులు, గెస్ట్ ఫ్యాకల్టీ ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మరోవైపు వీసీ ఛాంబర్‌లో ఇప్పటివరకూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చిత్రపటం ఏర్పాటు చేయకపోవడంపై అభ్యంతరం వ్యక్తంచేస్తూ టీఎన్ఎస్ఎఫ్ ప్రతినిధులు, జనసేన కార్యకర్తలు గురువారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకూ ధర్నా చేశారు. ఆందోళనలు మరింత ఉధృతమయ్యే అవకాశం ఉందన్న సమాచారం అందడంతోనే వీసీ, రిజిస్ట్రార్‌లు శుక్రవారం రాజీనామా చేసినట్టు చెబుతున్నారు. వీసీ తన రాజీనామాను గవర్నర్‌కు పంపించగా, అంతకుముందే రిజిస్ట్రార్ జేమ్స్ తన రాజీనామాను వీసీగా ఉన్న ప్రసాదరెడ్డికి అందించారు. వీసీ తాను రాజీనామా చేయడానికి ముందే అకడమిక్ డీన్‌గా ఉన్న ప్రొఫెసర్ కిశోర్‌బాబుకు రిజిస్ట్రార్‌గా అడిషనల్ చార్జ్ అప్పగించారు.

వివాదాస్పద నిర్ణయాలే కారణం..

వీసీగా ప్రసాదరెడ్డి తీసుకున్న అనేక నిర్ణయాలు ప్రస్తుతం ఆయనపై తీవ్ర వ్యతిరేకతకు కారణమయ్యాయి. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకూ తొలుత ఇన్‌చార్జిగా, ఆ తరువాత పూర్తిస్థాయి వీసీగా కొనసాగిన ప్రసాదరెడ్డి...వర్సిటీని ఒకరకంగా ఆ పార్టీ కార్యాలయంగా మార్చేశారు. వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి, ఆయన తల్లి విజయలక్ష్మి, రాజ్యసభ ఎంపీ విజయసాయిరెడ్డి పుట్టినరోజు వేడుకలను తన ఛాంబర్‌లో నిర్వహించారు. అలాగే వీసీగా ఆయన తీసుకున్న అనేక నిర్ణయాలు వివాదాస్పదమయ్యాయి. ప్రొఫెసర్ కృష్ణమోహన్‌ను నిబంధనలకు విరుద్ధంగా మూడుసార్లు రిజిస్ట్రార్‌గా తీసుకున్నారు. ఆ తరువాత కూడా ఆయనకు ఏయూలో ఎన్నడూ లేని విధంగా ఓఎస్‌డీ పోస్టును సృష్టించి బాధ్యతలను అప్పగించారు. అదేవిధంగా ఏయూతో సంబంధం లేని బయటి వ్యక్తి అయిన జేమ్స్ స్టీఫెన్‌ను రిజిస్ట్రార్ సీటులో కూర్చోబెట్టారు. యూనివర్సిటీ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా చైర్ ప్రొఫెసర్‌గా ఉన్న వ్యక్తికి రిజిస్ట్రార్ పోస్టు దక్కేలా చక్రంతిప్పారు. ఇది అప్పట్లోనే సంచలనం అయింది.

- ▸▸ అడ్డగోలుగా నియామకాలు
- ▸▸ అస్మదీయులకు పదవులు
- ▸▸ నిధులు దుర్వినియోగమయ్యాయనే ఆరోపణలు
- ▸▸ వీసీ, రిజిస్ట్రార్‌ల రాజీనామాతో క్యాంపస్‌లో సంబరాలు
- ▸▸ వీసీ పోస్టు ఎవరికి దక్కుతుందో...
- ▸▸ జాబితాలో పలువురు పేర్లు



పీవీజీడీ ప్రసాదరెడ్డి

అస్మదీయులకు పదవుల పందేరం

వీసీ ప్రసాదరెడ్డి తన హయాంలో అస్మదీయులకు పెద్ద ఎత్తున పదవుల పందేరం చేశారన్న విమర్శలు ఉన్నాయి. తనకు కావాల్సిన వారిని కీలక స్థానాల్లో కూర్చోబెట్టుకున్నారు. ఇరవై మందికిపైగా రిటైర్డ్ ఉద్యోగులకు కీలక స్థానాలను కట్టబెట్టారు. చైర్ ప్రొఫెసర్, ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టీస్, గౌరవ ప్రొఫెసర్ల పేరుతో ఎంతో మందిని నియమించుకుని భారీగా వేతనాలు ఇచ్చారు. ప్లేస్‌మెంట్ ఆఫీసర్లను, వివిధ విభాగాల్లో కాంట్రాక్ట్ ఫ్యాకల్టీలను

... మిగతా 6వ పేజీలో



వీసీ, రిజిస్ట్రార్‌లు రాజీనామా చేయడంతో క్యాంపస్‌లో కేక్ కట్ చేస్తున్న విద్యార్థి, అధ్యాపక సంఘాల ప్రతినిధులు



జేమ్స్ స్టీఫెన్

ఏయూను భ్రష్టు పట్టించారు

▸▸ గంటా శ్రీనివాసరావు -6లో

జల్‌జీవన్‌లో అక్రమాలు

నాసిరకం పైపుల వినియోగం

- ▸▸ పొరుగు జిల్లా వైసీపీ నేతకు చెందిన కంపెనీ నుంచి కొనుగోలు
- ▸▸ పైపుల నాణ్యత నిర్దేశిత ప్రమాణాల మేరకు లేదని ఏడాది క్రితమే తేల్చిన క్వాలిటీ కంట్రోల్ విభాగం
- ▸▸ కంపెనీ అధినేత, వైసీపీ నేత లాబీయింగ్
- ▸▸ తనిఖీల బాధ్యత నుంచి క్వాలిటీ కంట్రోల్ విభాగాన్ని తప్పించిన ప్రభుత్వం
- ▸▸ ప్రభుత్వం మారడంతో వెలుగులోకి అవకతవకలు
- ▸▸ విచారణ జరపాలని సర్పంచులు డిమాండ్



జల్‌జీవన్ మిషన్ పనులకు వినియోగించే పైపులు

విశాఖపట్నం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతంలో ప్రతి ఇంటికీ రక్షిత మంచి నీరు అందించాలన్న ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన జల్‌జీవన్ మిషన్ పనుల్లో భారీగా అవకతవకలు జరిగాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నీటి సరఫరా కోసం వేసిన పైపుల్లో ఏమాత్రం నాణ్యత లేదని సర్పంచుల నుంచి ఎంపీపీ వరకూ...అందరూ బహిరంగంగానే చెబుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో పొరుగు జిల్లాకు చెందిన వైసీపీ కీలక నేతకు చెందిన కంపెనీ నుంచి కొనుగోలు చేసిన ఈ పైపుల్లో కొన్ని బ్యాచ్‌లు నాసిరకంగా ఉన్నాయని క్వాలిటీ కంట్రోల్ అధికారులు తేల్చారు. దాంతో పైపులు నాణ్యత నిర్ధారించే విధుల నుంచి ఏకంగా క్వాలిటీ కంట్రోల్ విభాగాన్ని తప్పించి రెగ్యులర్ అధికారులకు అప్పగించారు. ప్రభుత్వం మారిన తరువాత జల్‌జీవన్ మిషన్‌లో అక్రమాలు బయటకు వస్తున్నాయి.

జల్‌జీవన్ మిషన్ పథకం కింద ఉమ్మడి జిల్లాలో రూ.87,760.37 లక్షలతో 4,542 పనులు ప్రతిపాదించారు. అయితే కేంద్రం నిధులిచ్చినా రాష్ట్ర ప్రభుత్వం తన వాటా విడుదలలో జాప్యం చేయడంతో పనులు చాలా ఆలస్యంగా ప్రారంభించారు. ఇప్పటివరకూ రూ.27,914.92 లక్షలు ఖర్చుచేసి 2,747 పనులు పూర్తిచేయగా, మరో 1,153 పనులు వివిధ దశల్లో ఉన్నాయి. కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో మిగిలిన పనులు ప్రారంభం కాలేదు. కాగా పనుల్లో ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణం కంటే వీధుల్లో పైపులు వేసి ఇంటింటికీ ట్యాపులు బిగించడానికే ప్రాధాన్యం ఇచ్చారు. అందుకు అవసరమైన పైపులు కొనుగోలు విషయంలో ఉన్నత స్థాయి నుంచి ఒత్తిళ్లు వచ్చాయి. దీంతో పొరుగు జిల్లాకు చెందిన కీలక వైసీపీ నేత సొంత కంపెనీ నుంచి ఎక్కువగా పైపులు కొనుగోలు చేశారు. ఇంకా ఇతర కంపెనీల నుంచి కూడా పైపులు కొన్నారు. అయితే వైసీపీ నేత కంపెనీ నుంచి కొనుగోలు చేసిన పైపుల్లో కొన్ని బ్యాచ్‌లు నాసిరకంగా ఉన్నాయని ఏడాది క్రితం ఆరోపణలు రావడంతో గ్రామీణ నీటి సరఫరా విభాగంలోని క్వాలిటీ కంట్రోల్ సెల్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. కంపెనీకి వెళ్లి పరిశీలించి కొన్ని బ్యాచ్‌లు నిర్దేశించిన ప్రమాణాల మేరకు లేవని గుర్తించారు. క్వాలిటీ కంట్రోల్ సెల్ నుంచి

... మిగతా 6వ పేజీలో

బదిలీల కోసం రెవెన్యూలో ఎదురుచూపు

- ▸▸ ఎన్నికల నేపథ్యంలో బదిలీపై వెళ్లిన వారంతా త్వరలో వెనక్కి
- ▸▸ ఉమ్మడి జిల్లా ప్రాతిపదికగా పోస్టింగ్స్ ఇవ్వాలని వినతి
- ▸▸ నగర శివారుల్లో తహసీల్దార్ల పోస్టింగ్‌కు గిరాకీ

విశాఖపట్నం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మారిన నేపథ్యంలో రెవెన్యూలో బదిలీల కోసం అధికారులు ఎదురుచూస్తున్నారు. ముఖ్యంగా తహసీల్దారు కేడర్‌లో త్వరలో బదిలీలు జరగనున్నాయి. ఎన్నికల సమయంలో జిల్లాలో పనిచేస్తున్న తహసీల్దార్లు ఇతర జిల్లాలకు వెళతారు. ఇతర జిల్లాల నుంచి ఇక్కడకు వస్తారు. ఎన్నికల ప్రక్రియ ముగిసిన వెంటనే ప్రభుత్వం తహసీల్దార్లను గతంలో పనిచేసిన జిల్లాలకు పంపుతుంటుంది. ప్రస్తుతం అదే విధానంలో బదిలీలు జరుగుతాయని ఆశిస్తున్నారు. ఎన్నికల సమయంలో విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల నుంచి పలువురు తహసీల్దార్లు విశాఖ జిల్లాకు వచ్చారు. ఎన్నికలు ముగియడంతో వారంతా ఎప్పుడు తాము గతంలో పనిచేసిన జిల్లాలకు వెళ్లిపోదామా అని ఎదురుచూస్తున్నారు. అదేవిధంగా విశాఖ నుంచి విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాలకు వెళ్లిన తహసీల్దార్లు తిరిగి వెనక్కి రావాలని చూస్తున్నారు. అయితే జిల్లాల విభజన సమయంలో అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాలకు కేటాయించిన పలువురు తహసీల్దార్లు ఎన్నికల సమయంలో పొరుగు జిల్లాలకు వెళ్లారు. వారంతా ఈసారి బదిలీలకు ఉమ్మడి జిల్లాను ప్రాతిపదికగా తీసుకోవాలని కోరుతున్నారు. రెండేళ్లపాటు ఏజెన్సీలో, మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసిన తమకు విశాఖ జిల్లాలో అవకాశం కల్పించాలని అధికార పార్టీ నేతలకు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రభుత్వ స్థాయిలో ఒక నిర్ణయం తీసుకోవాలని, లేకపోతే మరికొన్నాళ్లు ఏజెన్సీ మారుమూల ప్రాంతాల్లోనూ ఉండిపోవాల్సి వస్తోందంటున్నారు. ఇదిలావుండగా ఎన్నికల ముందు నగరం, శివారు ప్రాంతాల్లో పనిచేసి ప్రస్తుతం పొరుగు జిల్లాలో ఉన్న

... మిగతా 6వ పేజీలో

గేమింగ్ డిజార్డర్

గంటల తరబడి ఆన్‌లైన్‌లో గేమ్స్ ఆడుతున్న విద్యార్థులు, యువతీయువకులు

బానిసలుగా మారుతున్న వైనం

- ▸▸ ఎవరితోనూ కలవకపోవడం, గందరగోళం, తిండి, నిద్ర తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తే తల్లిదండ్రులు అప్రమత్తం కావలసిందే...
- ▸▸ అలాగే వదిలేస్తే ప్రమాదం
- ▸▸ కౌన్సిలింగ్, మందులతో సాధారణ స్థితికి తీసుకురావచ్చంటున్న మానసిక వైద్యులు



విశాఖపట్నం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి):

▸▸ నగర పరిధిలోని తాటిచెట్లపాలెం ప్రాంతానికి చెందిన 13 సంవత్సరాల విద్యార్థి కొద్దిరోజుల నుంచి ఆన్‌లైన్ గేమ్స్ ఆడుతున్నాడు. రోజుకు పది గంటలకుపైబడే ఆడుతుండడం, బయటకు వెళ్లేందుకు ఇష్టపడకపోవడం, పాఠశాలకు కూడా వెళ్లకపోవడం, ఇంట్లో గదికి పరిమితమవ్వడంతో తల్లిదండ్రులు చుట్టుపక్కల వాళ్ల సలహాతో మానసిక వైద్యుల వద్దకు తీసుకువెళ్లారు. పరీక్షించిన వైద్యులు ఆన్‌లైన్ గేమింగ్ డిజార్డర్‌తో బాధపడుతున్నట్టు తేల్చారు.

▸▸ రామ్‌నగర్ ప్రాంతానికి చెందిన ఓ యువకుడు ఆన్‌లైన్ బెట్టింగ్‌లో రూ.లక్షలు పోగొట్టుకున్నాడు. బెట్టింగ్ కోసం అప్పులు చేశాడు. తల్లిదండ్రులు ఆస్తులు అమ్మి అప్పులు తీర్చారు. అయినా అతని తీరులో మార్పు రాకపోవడంతో మానసిక వైద్యులు వద్దకు తీసుకువెళ్లారు. యాప్‌లో ఏదో ఒక గేమ్ ఆడడాన్ని వ్యసనంగా మార్చుకున్నట్టు తేల్చిన వైద్యులు ఆస్పత్రిలో చేర్చుకుని కౌన్సెలింగ్, మందులు ఇవ్వడం ద్వారా మెల్లగా సాధారణ స్థితికి తీసుకువచ్చారు.

గత కొన్నాళ్లుగా ఆన్‌లైన్ గేమింగ్ డిజార్డర్‌తో బాధపడుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. ఆన్‌లైన్‌లో గంటలు తరబడి గేమ్స్ ఆడుతుండే వారంతా ఇదే కోవకు వస్తుంటారు. ఈ సమస్యతో బాధపడేవారు కనీసం ఎనిమిది నుంచి 12 గంటలపాటు గేమ్స్ ఆడుతూ ఉంటారు. తిండి, నిద్ర, ఇతర వ్యాపకాల గురించి అసలు పట్టించుకోరు. రూమ్‌కు పరిమితమై గేమ్ ఆడుతూ అవతలి వారితో మాట్లాడుతూ సమయాన్ని గడుపుతుంటారు. ముఖ్యంగా ఆరు, ఏడు తరగతులు చదువుతున్న విద్యార్థుల నుంచి ఇంజనీరింగ్ వంటి కోర్సులు చదువుతున్న వారిలో ఈ తరహా సమస్యలు కనిపిస్తున్నట్టు వైద్యులు చెబుతున్నారు. రోజుల తరబడి ఆడుతున్నా తల్లిదండ్రులు గుర్తించి మందలించకపోవడంతో ఇది వ్యసనంగా మారి గేమింగ్ డిజార్డర్‌కు దారితీస్తోందంటున్నారు. పబ్జీ, ఫ్రీ ఫైర్ వంటి గేమ్స్ ఆడే వారిలో ఈ తరహా ఇబ్బందులు ఉంటున్నాయని చెబుతున్నారు. ఇటువంటి గేమ్స్ అనేకం ఉన్నాయి. ఈ గేమ్స్ ఆడేవాళ్లు..అవతలి వ్యక్తులతో సంభాషిస్తూ ఎనలేని ఆనందాన్ని పొందుతుంటారు. దీంతో ఎన్ని గంటలు ఆడినా వారికి సమయం తెలియదు. ఇదే డిజార్డర్‌కు దారితీస్తోందని వైద్య నిపుణులు చెబుతున్నారు.

ఈ లక్షణాలుంటే అప్రమత్తం కావాలి..

గంటల తరబడి ఫోన్లు పట్టుకుని ఆటలాడుతుంటే తల్లిదండ్రులు అప్రమత్తం కావాల్సిందేనని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ఎవరితోనూ కలవకపోవడం, ఇంట్లోనే ఒక గదికి పరిమితం కావడం,

... మిగతా 6వ పేజీలో

టోల్ చార్జీలు వసూలు నిలిపివేత

- ▸▸ అగనంపూడి టోల్‌గేట్ ఎత్తివేత నేపథ్యంలో ఆర్టీసీ విశాఖపట్నం రీజియన్ నిర్ణయం
- ▸▸ అనకాపల్లికి ఐదు నుంచి పది రూపాయల వరకూ తగ్గనున్న చార్జీ

ద్వారకా బస్‌స్టేషన్, జూన్ 28: అగనంపూడి వద్ద టోల్‌గేట్‌ను ఎత్తివేయడంతో ఆర్టీసీ టోల్ చార్జీల వసూలును నిలిపివేసింది. ఈ మేరకు ఆర్టీసీ విశాఖపట్నం రీజియన్ శుక్రవారం నిర్ణయం తీసుకుంది. విశాఖపట్నం నుంచి అనకాపల్లి, రాజమండ్రి, తదితర ప్రాంతాలకు వెళ్లే బస్సు ప్రయాణికుల నుంచి ఆర్టీసీ టోల్ చార్జీలు వసూలు చేసేది. ఆర్డినరీ, పల్లెవెలుగు సర్వీసుల్లో ప్రయాణించే వారి నుంచి ఐదు రూపాయలు, ఎక్స్‌ప్రెస్, మెట్రో, సర్వీసుల ప్రయాణికుల నుంచి ఏడు రూపాయలు, సూపర్ లగ్జరీ, ఆల్ట్రా డీలక్స్, మెట్రో లగ్జరీ, గరుడ, గరుడ ప్లస్, అమరావతి, నైట్ రైడర్ వంటి సర్వీసుల ప్రయాణికుల నుంచి మనిషికి పది రూపాయలు చొప్పున టోల్ చార్జీలు వసూలు చేసేవారు. శుక్రవారం నుంచి ఈ టోల్ చార్జీల వసూళ్లను ఆర్టీసీ నిలిపివేసింది. ఈ మేరకు టికెట్ ఇష్యూ మెషీన్ (టిమ్)లో సాఫ్ట్‌వేర్‌ను సవరించారు. విశాఖ నుంచి అగనంపూడి టోల్‌గేటు మీదుగా అనకాపల్లి, ఎలమంచిలి, నర్సీపట్నం, పాయకరావుపేట ప్రాంతాలకు 92 ఆర్డినరీ, పల్లెవెలుగు సర్వీసులు, రాజమండ్రి, కాకినాడ ప్రాంతాలకు 20 ఎక్స్‌ప్రెస్, మెట్రో, మెట్రో లగ్జరీ సర్వీసులు, విజయవాడ, హైదరాబాద్, తిరుపతి, వంటి దూరప్రాంతాలకు డీలక్స్, సూపర్ డీలక్స్ ఆల్ట్రా డీలక్స్, గరుడ, గరుడప్లస్, అమరావతి, నైట్ రైడర్, వంటి సర్వీసులు 120 రాకపోకలు సాగిస్తున్నాయి. వీటిలో ప్రయాణించే వారికి ఇక నుంచి టోల్ చార్జీలు ఉండబోవని ఆర్టీసీ విశాఖ రీజియన్ అధికారులు ప్రకటించారు.

నేడు జడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

విశాఖపట్నం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు శనివారం ఉదయం పది గంటల నుంచి జరుగుతాయని సీఈఓ ఎం.పోలినాయుడు తెలిపారు. జడ్పీ సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన ఉదయం 10 గంటలకు రెండు, ఐదు, 11 గంటలకు మూడు, నాలుగు స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు ఒకటి, ఆరు, ఏడు స్థాయీ సంఘ సమావేశాలు జరుగుతాయని...ఈ సమావేశాలకు సభ్యులు హాజరుకావాలని ఆయన కోరారు.

ఘనంగా రాజా విక్రమ్‌దేవ్‌వర్మ జయంతి



విగ్రహం ఎదుట నివాళులర్పిస్తున్న దృశ్యం

డాబాగార్డెన్స్, జూన్ 28: ఆంధ్ర విశ్వ కళాపరిషత్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన రాజా విక్రమ్‌దేవవర్మ విగ్రహం వద్ద రాజావారి 155వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విక్రమ్‌దేవ్‌వర్మ మనుమరాలు, జైపూర్ రాజమాత మయాంక్ కుమారి దేవ్ మాట్లాడుతూ.. రాజా విక్రమ్‌దేవ్‌వర్మ విద్య, సామాజిక రంగాల్లో చేసిన సేవలను వివరించారు. ఆంధ్ర యూనివర్సిటీ , ఒడిశాలో ఉత్కల్ యూనివర్సిటీ ఏర్పాటుకు ఆయన వందలాది ఎకరాల భూమిని విరాళంగా అందజేశారన్నారు. సాహితీపరంగా ప్రబంధ కావ్యాలను రచించారన్నారు. సోమవారం ఎంపీడీఎం పాఠశాలలో రాజావారిపేరుపై విద్యార్థులకు పుస్తకాలు, జామెట్రీబాక్సులు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జైపూర్ యువరాణి లతికాదేవ్, రాజవంశీకులు వివేక్, లతికా డియో, చిట్లూరి గిరిధర్, రవి ప్రకాష్ బెయడ్, ఎ.వెంకటరామన్, సురేంద్ర పాల్గొన్నారు.

తెలుగు వారు గర్వపడే నేత పీవీ



పీవీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

మహారాణిపేట, జూన్ 28: ప్రపంచంలో తెలుగువారికి గుర్తింపు తెచ్చిన మహానేత దివంగత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు అని మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ అన్నారు. శుక్రవారం మాజీ ప్రధాన మంత్రి, భారత రత్న పీవీ 103 వ జయంతి సందర్భంగా గవర్నర్ బంగ్లా వద్ద గల ఆయన విగ్రహానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం ఆర్థిక పరిస్థితి క్లిష్టంగా ఉన్న సమయంలో పీవీ సంస్కరణలు అమలు చేసి దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించారని కొనియాడారు.ఈ కార్యక్రమంలో లంకా శ్రీనివాసరావు దాడిలక్ష్మణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు తొలగింపు

సీతమ్మధార, జూన్ 28: నక్కవానిపాలెంలోఓ భవనం సెల్లర్‌లోని అక్రమ నిర్మాణాలను జీవీఎంసీ సిబ్బంది శుక్రవారం తొలగించారు. ఓ మూడంతస్తుల భవనంలో నిబంధనలకు విరుద్ధంగా సెల్లర్ స్థలంలో గదులు కట్టడంతో ఈ నిర్మాణాలను తొలిగించినట్టు టౌన్ ప్లానింగ్ సెక్రటరీలు వెంకటలక్ష్మి, సందీప్, హరీష్‌లు తెలిపారు. పార్కింగ్ కింద చూపించిన స్థలంలో ఈ అక్రమ నిర్మాణం చేపట్టినట్టు వారు చెప్పారు.

డిపోలకు బియ్యం పంపండి: డీఎస్‌వో

విశాఖపట్నం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): తెల్ల రేషన్ కార్డుదారులకు వచ్చేనెల ఒకటోతేదీ నుంచి బియ్యం పంపిణీకి ఇబ్బందిలేకుండా సత్వరం రవాణా చేయాలని గోదాము ఇన్‌చార్జిలకు జిల్లా పౌరసరఫరాల అధికారి గూన సూర్యప్రకాశరావు ఆదేశించారు. శుక్రవారం మర్రిపాలెంలో పౌరసరఫరాల సంస్థ పరిధిలో రెండు గోదాములను ఆయన సందర్శించారు. నగరంలో చాలా డిపోలకు ఇంకా బియ్యం సరఫరా జరగలేదని పేర్కొన్నారు. ఈస్థితిలో లోడింగ్‌లో వేగం పెంచాలన్నారు.జిల్లాలో 641 రేషన్‌డిపోలకుగాను ఇంత వరకు 346 డిపోలకు బియ్యం సరఫరా జరిగిందని, శని, ఆదివారాల్లో మిగిలినడిపోలకు సరకులుఅందాలని ఆదేశించారు.

జల్‌జీవన్‌లో అక్రమాలు

... 5వ పేజీ తరువాయి

అభ్యంతరాలు రావడంలో సదరు నేత అప్రమత్తమయ్యారు. పైపుల్లో లోపాలను గుర్తించిన అధికారులపై ఒత్తిడి తీసుకురావడంతోపాటు బెదిరించారు. అయినా అధికారులు నాసిరకం పైపుల విషయంలో వెనక్కి తగ్గలేదు. ఈ నేపథ్యంలో జల్‌జీవన్ మిషన్ పనుల్లో వినియోగించే పైపులు తనిఖీ చేసే బాధ్యత నుంచి క్వాలిటీ కంట్రోల్ అధికారులకు తప్పించేలా సదరు నేత ప్రభుత్వంలో లాబీయింగ్ చేశారు. ఈ మేరకు పైపుల నాణ్యత తనిఖీ అధికారం నుంచి గత ఏడాది అక్టోబరులో క్వాలిటీ కంట్రోల్ సెల్‌కు తప్పించిన ప్రభుత్వం ఆ బాధ్యత రెగ్యులర్ ఇంజనీర్లకు అప్పగించింది. దీనిపై అప్పట్లో అనేక అనుమానాలు వ్యక్తమైనా ఎవరు నోరు విప్పలేదు. జిల్లాలో చేపట్టిన పనుల్లో చాలాచోట్ల లోపాలున్నట్టు గుర్తించినా చర్యలు తీసుకోలేదు. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో జలజీవన్ మిషన్ పనులు, పైపుల్లో లోపాలపై విచారణ చేయాలని పలువురు సర్పంచులు కోరుతున్నారు. ఈ విషయం గ్రామీణ నీటి సరఫరా విభాగం ఇన్‌చార్జి ఎస్ఈ కృష్ణారెడ్డి వద్ద ప్రస్తావించగా ప్రభుత్వం నిర్దేశించిన మేరకు పనులు చేపట్టామన్నారు.

టర్నర్ చౌల్ట్రీ వద్ద కనిపించని బస్ షెల్టర్

- రోడ్డు విస్తరణలో తొలగింపు
- దేవదాయ శాఖ స్థలంలో విశాఖ బజారు ఏర్పాటుతో అవస్థలు



గతంలో బస్సు షెల్టర్ ఉన్నచోట దేవదాయశాఖ షాపులు

జగదాంబ కూడలి, జూన్ 28: వన్‌టౌన్‌లోని టర్నర్ చౌల్ట్రీ వద్ద ఆర్టీసీ బస్ షెల్టర్ కనుమరుగైంది. ప్రైవేటు సిటీ బస్సు సర్వీసులు తిరిగినప్పటినుంచి ప్రయాణికులకు ఇక్కడ బస్ షెల్టర్ ఉండేది. సూపర్ బజార్ మెయిన్ రోడ్డు వైపు దేవదాయ శాఖకు చెందిన స్థలం ఎదుట టర్నర్ చౌల్ట్రీ వద్ద విశాఖ బజార్ నిర్మించడంతో ఈ బస్ షెల్టర్ ప్రస్తుతం కనిపించకుండా చేశారు. రోడ్డు విస్తరణలో భాగంగా దీనిని తొలగించినా, అక్కడే ఓ షాపును మాత్రం ఉంచేశారు. రోజూ ఎంతో మందికి ఉపయోగపడే బస్ షెల్టర్ లేకుండా చేసిన దేవదాయ అధికారులపై ప్రయాణికులు అసహనం వ్యక్తంచేస్తున్నారు. అలాగే, అధికారులు వన్‌టౌన్ పరిధిలో రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా చాలాచోట్ల ఆర్టీసీ ప్రయాణికుల బస్‌షెల్టర్స్‌ను తొలగించారు.

వన్‌టౌన్‌లో పలుచోట్ల ఇదే పరిస్థితి..

పూర్ణామార్కెట్, రీడింగ్ రూమ్, కురుపాం మార్కెట్ పాతపోస్టాఫీసుకు వెళ్లే ప్రయాణికులూ పలుచోట్ల బస్ షెల్టర్లు లేక ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. గత ప్రభుత్వం పలుచోట్ల బస్‌బేల పేరుతో ఆట్టహాసంగా నిర్మాణాలు చేపట్టినా వన్‌టౌన్‌లో మాత్రం వాటి ఆచూకీ లేకుండా చేయడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. జగదాంబ వద్ద లక్కీమాల్ నుంచి పాతపోస్టాఫీసు వరకు ఎక్కడా బస్ షెల్టర్లు నిర్మించకపోవడంతో ప్రయాణికులకు ఎండావానాలనుంచి రక్షణ కరవుతోంది. జోన్-4 ఇంజనీరింగ్ అధికారుల వల్లే పాతనగరంలో ఈ దుస్థితి నెలకొందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం హయాంలోనైనా వన్‌టౌన్ ప్రాంతంలో బస్ షెల్టర్లు నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

అలరించిన భువన విజయం సాహితీ రూపకం



నాటకంలో ఓ సన్నివేశం

అక్కయ్యపాలెం, జూన్ 28: గురువుల ఆరాధనోత్సవాల్లో భాగంగా లలితాపీఠంలో శుక్రవారం రాత్రి హైదరాబాద్‌కు చెందిన అక్కిరాజు సుందర రామకృష్ణంరాజు బృంద కళాకారులు ప్రదర్శించిన భువన విజయం సాహితీ రూపకం అప్పటి వైభవాన్ని ప్రేక్షకుల కళ్లకు కట్టినట్లు చూపారు. శ్రీకృష్ణదేవరాయల కాలానికి తీసుకువెళ్లేలా రసాస్వాదనకు లోను చేశారు. డాక్టర్ అక్కిరాజు సుందర రామకృష్ణంరాజు శ్రీకృష్ణదేవరాయలుగా అద్భుతమైన రాజసం, ఆహార్యంతో ఆకట్టుకున్నారు. అలాగే, అప్పాజీగా ముదిగొండ శివప్రసాద్, అల్లసాని పెద్దనగా పంద్రప్రగడ శ్రీనివాస్, మల్లనగా భాస్కరరభట్ల, అయ్యలరాజుగా కె.చంద్రశేఖరం, పింగళి సూరనగా చౌదరి నరసింహారావు, నంది తిమ్మనగా మల్లాది వెంకట గోపాలకృష్ణ, ధూర్జటిగా యెల్లంరాజు త్యాగరాజు, భట్టుమూర్తిగా సీఎంకే గాంధీ, తెనాలి రామకృష్ణుడిగా మావుడూరు సూర్యనారాయణ మూర్తి అద్భుత ఆహార్యం, పద్యాల పఠనంతో అలరించారు. కుర్తాళం శంకరాచార్యులు సిద్దేశ్వరానంద భారతీ మహాస్వామి సమక్షంలో జరిగిన ఈ సాహితీ రూపకాన్ని పలువురు భక్తులు, సాహితీ వేత్తలు వీక్షించారు. ఈ కార్యక్రమాన్ని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ పర్యవేక్షించారు. శక్తి పీఠాధీశ్వరి రమ్యానంద భారతీ స్వామిని పాల్గొన్నారు.

ఆర్టీసీ సిబ్బందిపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



డీజీపీ ద్వారకా తిరుమలరావును సన్మానిస్తున్న ఎన్ఎంయూ నాయకులు

ద్వారకాబస్‌స్టేషన్, జూన్ 28: విధి నిర్వహణలో ఉన్న ఆర్టీసీ సిబ్బందిపై దాడులకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి వై శ్రీనివాసరావు డీజీపీ ద్వారకా తిరుమలరావును కోరారు. నూతన డీజీపీగా నియమితులైన తిరుమలరావును అసోసియేషన్ నాయకులు శుక్రవారం ఆయన కార్యాలయంలో కలిసి సత్కరించారు. అనంతరం వినతి పత్రమిచ్చారు. ఆర్టీసీ డ్రైవర్ల తప్పు లేకున్నా, పెద్ద వెహికల్ పేరిట అన్యాయంగా వారిపై కేసులు పెడుతున్నారన్నారు. ఇలాంటి వాటికి తావులేకుండా అన్ని జిల్లాల పోలీస్ అధికారులకు ఆదేశాలివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసరాజు, కోశాధికారి పీవీవీ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఏయూను భ్రష్టుపట్టించారు

- వీసీ ప్రసాదరెడ్డి వ్యవహారశైలిపై 'ఎక్స్' వేదికగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆగ్రహం

విశాఖపట్నం, జూన్ 28: ప్రతిష్ఠాత్మకమైన ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రమాణాలు దిగజార్చిన పీవీజీడీ ప్రసాదరెడ్డి వైస్ చాన్సలర్‌గా కొనసాగడానికి అనర్హులని మానవ వనరుల శాఖా మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పేర్కొన్నారు. శుక్రవారం 'ఎక్స్' వేదికగా చేసిన ట్వీట్‌లో వివిధ అంశాలపై ప్రసాదరెడ్డి తీరును విమర్శించారు. ఆంధ్ర ప్రజలు 93 శాతం సీట్లతో కూటమిని ఆశీర్వదిస్తే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఫొటోను వీసీ తన చాంబర్‌లో పెట్టకపోవడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. విద్యార్థులకు, ఉద్యోగులకు ఆదర్శంగా ఉండాల్సిన వ్యక్తి వైసీపీ కార్యకర్తకంటే ఎక్కువగా ఆ పార్టీతో అంటకాగారని విమర్శించారు.ఐదేళ్లలో యూనివర్సిటీ ప్రతిష్ఠను దిగజార్చారన్నారు. ల్యాబ్‌లు, ఈ-క్లాస్‌రూమ్‌లు, రీసెర్చ్, విద్యా ప్రమాణాలు పెంచడం కోసం ఇచ్చిన వందల కోట్ల రూపాయల రూసా నిధులను ఇతర పనులకు మళ్లించి ప్రసాదరెడ్డి దుర్వినియోగం చేశారని గంటా ఆరోపించారు. ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో సాధారణ లెక్చరర్‌గా ఉన్న స్టీఫెన్‌ను తీసుకొచ్చి నిబంధనలకు వ్యతిరేకంగా అంబేడ్కర్ చైర్ ప్రొఫెసర్‌గా నియమించారన్నారు. అనంతరం ఎంతోమంది సీనియర్ ప్రొఫెసర్లు యూనివర్సిటీలో ఉన్నా స్టీఫెన్‌ను రిజిస్ట్రార్‌గా నియమించడం వైస్ చాన్సలర్ అధికార దుర్వినియోగానికి నిదర్శనమన్నారు.

అర్హులను వదిలేసి రిటైర్డ్ ఉద్యోగులకు పునరావాసం

యూనివర్సిటీలో అర్హత ఉన్న ఉద్యోగులను పక్కనపెట్టి రిటైరైన వారికి ప్రసాదరెడ్డి అత్యున్నత పదవులు కట్టబెట్టారని పేర్కొన్నారు. రిటైర్డ్ ప్రొఫెసర్ కృష్ణమోహన్‌ను రిజిస్ట్రార్‌గా నియమించారని, డీన్‌లు, డైరెక్టర్లు వంటి ముఖ్యమైన పోస్టులను మాజీలకు ఇచ్చారన్నారు.

నోటిఫికేషన్ లేకుండా ఉద్యోగాలు

నోటిఫికేషన్ లేకుండా అస్మదీయులైన 150 మందిని ప్రొఫెసర్ ఆన్ ప్రాక్టీస్ పేరుతో నియమించుకున్నారని గంటా శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఇలా..ఆయన సొంత డిపార్టుమెంట్ కంప్యూటర్ సైన్స్‌లో 30 మందిని నియమించుకున్నారన్నారు. అలాగే స్పెషల్ ఎగ్జామ్ పేరుతో సీఐడీ చీఫ్‌కు పట్టా ఇచ్చారని, ఇది దౌర్భాగ్యమైన సంప్రదాయమని పేర్కొన్నారు. గాంధీ విగ్రహం పక్కనే వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని పెట్టించారని,వర్సిటీల్లో రాజకీయ విద్వేషాలు రెచ్చగొట్టారని పేర్కొన్నారు. సైకాలజీ ప్రొఫెసర్‌ను విచిత్రంగా ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా నియమించారన్నారు.

మార్కెట్లలో ఆశీలు వేలం వాయిదా

జగదాంబ కూడలి, జూన్ 28: పూర్ణామార్కెట్‌తోపాటు పలు వాణిజ్య సముదాయాల ఆశీలు టెండర్ల వేలం ప్రక్రియ వాయిదా పడింది. గ్రేటర్ పరిధిలోని జోన్- 4 కార్యాలయంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు ఈ వేలం ప్రారంభించారు. అయితే, సాయంత్రం వరకు టెండర్ల కోసం పాటదారులు ఎవరూ రాలేదు. జోన్- 4 పరిధిలోని వాణిజ్యసముదాయాలు, డైక్స్ ట్యాంక్, జగదాంబ, పాత బస్‌స్టాండ్ ఫేజ్-2, పద్మానగర్, సూర్యాబాగ్‌లోని వాణిజ్యసముదాయాలు, అంబేడ్కర్ కల్యాణ మండపం, రామకృష్ణా రైతుబజారు, రెల్లివీధి, చేపల మార్కెట్ల ఆశీలు వసూల కోసం వేలం కోసం నోటిఫికేషను జోనల్ కమిషనర్ ప్రసాదరావు విడుదల చేశారు. ఈ నేపథ్యంలో నిర్వహించిన వేలంలో సూర్యాబాగ్‌కు సంబంధించి ఒక్కరు మాత్రమే వచ్చినట్లు జోనల్ అధికారులు తెలిపారు. ఇలా పాటదారులు ఎవరూ పాల్గొనకపోవడం వెనుక వ్యూహం ఉన్నట్టు సమాచారం. వేలం వాయిదా పడితే ఆశీలు వసూలుకుగ్రేటర్ అధికారులు కోడ్ చేసిన సొమ్ము తగ్గించి మరోమారు వేలం నిర్వహిస్తారని వ్యాపార వర్గాలు భావిస్తున్నాయి. అలాగే,ఎన్నికల కోడ్ అమల్లో వచ్చినప్పటినుంచిపూర్ణామార్కెట్ ఆశీలు వసూలు బాధ్యత జీవీఎంసీ స్వయంగా చేపడుతోంది.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

డాబాగార్డెన్స్, జూన్ 28: ప్రభుత్వ పాఠశాలలోని నాణ్యమైన విద్యతో పాటు మౌలిక సదుపాయాలు, మధ్యాహ్నం భోజనం తదితర అవకాశాలు అందుబాటులో ఉన్నాయని జీవీఎంసీ 31 వార్డులోని ఆర్‌బీఎంయూసీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు హనుమంతు ప్రభాకర్ అన్నారు. శుక్రవారం వార్డు పరిధిలోని నేడు బడికి పోతా.. ర్యాలీ నిర్వహించారు. డాబాగార్డెన్స్, రంగాస్ట్రీట్, శారదాస్ట్రీట్ తదితర ప్రాంతాల్లో సాగిన అవగాహన ర్యాలీలో విద్యార్థులు పాల్గొని ప్రభుత్వ పాఠశాలలోని విద్యా ప్రాధాన్యంపై నినాదాలు చేశారు. పలు పథకాలు వర్తింపు తదితర అంశాలపై తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



వన్‌టౌన్ పోర్టు ఉర్దూ పాఠశాలలో పిల్లలను చేర్పిస్తున్న విద్యా శాఖ అధికారులు

బడిఈడు పిల్లలకు పాఠశాలల్లో ప్రవేశాలు

పూర్ణామార్కెట్: ప్రభుత్వం అమలుచేస్తున్న నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా బడిఈడు పిల్లలను పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. రాష్ట్ర అసిస్టెంట్ సహిత విద్యావిభాగం (ఓఎస్‌పీ) కో-ఆర్డినేటర్ కల్పనా శైలజ, అదనపు పథకం సమన్వయ కర్త బి.శ్రీనివాసరావు పలు వీధుల్లో ఇంటింటికి వెళ్లి విద్యకు గల ప్రాధాన్యం వివరించారు. తల్లిదండ్రులతో మాట్లాడి బడిఈడు కలిగిన మైనార్టీ పిల్లలనుపాఠశాలలో చేర్పించారు. కోటవీధి ఉర్దూ పాఠశాలలో బాలికలను ముగ్గురుని, పోర్టు ఉర్దూ బాలుర పాఠశాలలో ముగ్గురిని చేర్పించారు. క్వీన్ మేరీ బాలికల ఉన్నత పాఠశాలలో పది మందిని చేర్పించారు. ప్రభుత్వపరంగా విద్యార్థులకు అందజేస్తున్న ప్రోత్సాహకాలను తల్లిదండ్రులకు వివరించడంతోవారు తమ పిల్లలను బడికి పంపేందుకు ముందుకు వచ్చారని వారు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఏఎల్ఎస్ కో-ఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు, ఏపీవో అప్పలనాయుడు, అసిస్టెంట్ ఏఎంవో జి.లక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



డాబాగార్డెన్స్‌లో నేడు బడికి పోతా..అవగాహనర్యాలీ

కనకమహాలక్ష్మికి మల్లెలార్చన



జగదాంబ కూడలి, జూన్ 28: కనకమహాలక్ష్మికి శుక్రవారం ఉదయం క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ పూజలో ఉభయదాతలతో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం అర్చకులు అమ్మవారికి జలాభిషేకం జరిపారు. అలంకరించి, మల్లెమొగ్గలతో ఘనంగా పూజలు నిర్వహించారు.

బదిలీల కోసం రెవెన్యూలో ఎదురుచూపు

... 5వ పేజీ తరువాయి

తహసీల్దార్లు కొందరు వెనక్కి వచ్చే క్రమంలో కీలక పోస్టుల కోసం యత్నిస్తున్నారు. అయితే గతంలో పనిచేసిన పలువురు తహసీల్దార్లపై తీవ్ర ఆరోపణలు ఉన్నాయి. కొందరైతే వైసీపీ ప్రభుత్వంలో అధికార పార్టీ నేతలు, ఉన్నతాధికారులు చెప్పిన పనులు అడ్డగోలుగా చేశారు. శివారు ప్రాంతంలో ముగ్గురు, నలుగురు అక్రమాలకు పాల్పడ్డారు. ఒక తహసీల్దారు గత ప్రభుత్వ హయాంలో మూడు మండలాల్లో పనిచేసి నాయకుల ఆదేశాల మేరకు నడుచుకున్నారని రెవెన్యూ అధికారులే చెబుతారు. మరో అధికారి ల్యాండ్‌పూలింగ్ సమయంలో వైసీపీ నేతలకు అనుకూలంగా రికార్డులే మార్చేశారు. మరో తహసీల్దారు ఒక రియల్టర్‌కు చెందిన వాహనంలోనే తిరిగేవారు. మరో తహసీల్దార్ ఎన్నికల నేపథ్యంలో పొరుగు జిల్లాకు వెళ్లి ఏపీఐఐసీకి దఖలుపడిన డీఫారం భూములకు ఫ్రీ హోల్డ్ సర్టిఫికెట్లు జారీ చేశారు. శివారు మండలాల్లో పోస్టింగ్‌ల కోసం అప్పుడే కొందరు అధికారులు పైరవీ చేస్తున్నారు. అయితే వైసీపీ ప్రభుత్వంలో అక్రమాలకు పాల్పడిన తహసీల్దార్లను పక్కనపెట్టాలని ప్రభుత్వం యోచిస్తోందని తెలిసింది. ఇదిలావుండగా కలెక్టర్లు, డిప్యూటీ కలెక్టర్ల బదిలీలు జరిగిన వెంటనే తహసీల్దార్ల బదిలీలు ఉంటాయని రెవెన్యూ వర్గాల్లో చర్చ సాగుతుంది.

పల్లా శ్రీనివాసరావుకు సముచిత స్థానం

- టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ నజీర్





పల్లా శ్రీనివాసరావును అభినందిస్తున్న నజీర్, నాయకులు

మహారాణిపేట, జూన్ 28: టీడీపీ రాష్ట్ర నూతన అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు సారథ్యంలో రాష్ట్రంలో పార్టీ మరింత బలపడుతుందని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ నజీర్ అన్నారు. శుక్రవారం మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడిగా పల్లా శ్రీనివాసరావు పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనను నజీర్ సన్మానించి అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులకు లోను చేసినా నమ్ముకున్న సిద్ధాంతాలను వదిలిపెట్టకుండా విశాఖలో పార్టీని పల్లా విజయపథంలో నడిపించారన్నారు. ఈ పోరాటాల నేపథ్యంలో పల్లాకు సముచిత లభించిందన్నారు.

కంచరపాలెం: రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడిగా శుక్రవారం మంగళగిరిలో బాధ్యతలు చేపట్టిన పల్లా శ్రీనివాసరావును నగర టీడీపీ నాయకులు కలిసి ఘనంగా సత్కరించారు. తమ అభిమాన నేత రాష్ట్ర అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకరణకు నగరం నుంచి బయలుదేరి గురువారం మంగళగిరికి చేరుకున్నారు. శుక్రవారం బాధ్యతులు స్వీకరించిన అనంతరం తెలుగు యువత అధికార జిల్లా ప్రతినిధి జోగా మహేష్ కుమార్, విశాఖ పార్లమెంటరీ పార్టీ నాయీ బ్రాహ్మణ బీసీ సాధికార కమిటీ అధ్యక్షుడు దేవగుప్త రమేష్, జిల్లా బీసీ సెల్ సెక్రటరీ చల్లపల్లి నరేష్ కుమార్, కరుణాకరన్ తదితరులు పల్లాను అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

పలు రైళ్లకు అదనపు కోచ్‌లు

విశాఖపట్నం, జూన్ 28: ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని పలు రైళ్లకు తాత్కాలికంగా అదనపు కోచ్‌లు జత చేస్తున్నట్టు సీనియర్ డీసీఎం కే సందీప్ తెలిపారు. విశాఖ- కిరండోల్- విశాఖ పాసింజర్ రైళ్లకు (08551/085522) జూలై ఒకటి నుంచి ఆగస్టు ఒకటి వరకు ఒక థర్డ్ ఏసీ ఎకానమీ కోచ్ ఏర్పాటు. అలాగే, విశాఖ- గుణుపూర్-విశాఖ ప్రత్యేక పాసింజర్ రైళ్లకు (08522/08521) జూలై ఒకటి నుంచి 31వ తేదీ వరకు ఒక థర్డ్ ఏసీ, ఒక స్లీపర్ క్లాసు జత చే యనున్నారు. ఇక, నామినేటెడ్ రోజుల్లో నడిచే విశాఖ- నాందేడు- విశాఖ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు (20811/20812) జూలై రెండు నుంచి ఆగస్టు ఒకటి వరకు ఒక థర్డ్ ఏసీ ఎకానమీ, ఒక స్లీపర్ క్లాసు కోచ్‌లు, విశాఖ- అమృతసర్ -విశాఖ హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు (20807/ 20808) జూలై రెండు నుంచి ఆగస్టు మూడు వరకు ఒక థర్డ్ ఎకానమీ, ఒక స్లీపర్ క్లాసు కోచ్‌లు జత చేస్తున్నారు. భువనేశ్వర్-ఎస్ఎంవీ బెంగళూరు-భువనేశ్వర్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు (12845/ 12846) జూలై ఏడు నుంచి 29వ తేదీ వరకు ఒక థర్డ్ ఏసీ కోచ్; భువనేశ్వర్ -చెన్నై సెంట్రల్ - భువనేశ్వర్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు (12830/12829) జూలై నాలుగు నుంచి 26వ తేదీ వరకు ఒక థర్డ్ ఏసీ కోచ్, భువనేశ్వర్-తిరుపతి-భువనేశ్వర్‌సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు (22871/22872) జూలై ఏడు నుంచి 29వ తేదీ వరకు ఒక థర్డ్ ఏసీ ఎకానమీ కోచ్ అందుబాటులోకి తీసుకువస్తున్నారు. అలాగే, భువనేశ్వర్ -పూణే- భువనేశ్వర్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్ ప్రెస్ రైళ్లకు (22882/22881) జూలై రెండు నుంచి ఆగస్టు ఒకటి వరకు ఒక థర్డ్ ఏసీ ఎకా నమీ కోచ్; భువనేశ్వర్ -పాండిచ్చేరి- భువనేశ్వర్ సూపర్‌ఫాస్ట్ రైళ్లకు (12892/ 12897) జూలై రెండు నుంచి 31వ తేదీ వరకు ఒక స్లీపర్ క్లాసు కోచ్; భువనేశ్వర్- రామేశ్వరరం- భువనేశ్వర్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు (20896/20895) జూలై ఐదు నుంచి 28వ తేదీ వరకు ఒక స్లీపర్ క్లాసు కోచ్; పూరి- యశ్వంత్‌పూర్- పూరి గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు (22883/22884) జూలై ఐదు నుంచి 27వ తేదీ వరకు ఒక థర్డ్ ఏసీ కోచ్ జత చేయనున్నట్టు డీసీఎం పేర్కొన్నారు.

ఏయూ వీసీ అవుట్

... 5వ పేజీ తరువాయి

కూడా వీసీ ప్రసాదరెడ్డి నియమించు కున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అలా గే, నిబంధనలకు విరుద్ధంగా ఎయిడెడ్ ఫ్యాకల్టీని వీసీ వర్సిటీలోకి తీసుకువచ్చి కీలక విభాగాల్లో నియమించారు. అలాగే, రిటైర్డ్ పోలీస్ అధికారికి భారీగా వేతనాన్ని ఇచ్చి చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా నియమించుకున్నారు. అంతేగాకుండా పదుల సంఖ్యలో సెక్యూరిటీ గార్డులను నియమించుకుని ప్రైవేటు సైన్యాన్ని ఏర్పాటుచేసుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అదే సమయంలో తనకు నచ్చని వారిని పక్కనబెట్టేశారు. సుమారు 250 మంది గెస్ట్ ఫ్యాకల్టీని తొలగించేందుకు 28కిపైగా కోర్సులను రద్దు చేసేశారు.

పచ్చని చెట్లపై వేటు

జాతీయ స్థాయిలో వర్సిటీ ఖ్యాతిని మంటగలిపే మరో చర్యకు వీసీ ప్రసాదరెడ్డి పాల్పడ్డారు. వందలాది ఎకరాల్లో ఉన్న వేలాది వృక్షాలు, చెట్లను తొలగించేశారు. అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయనే వంకతో పచ్చదనంపై వేటువేశారు. ఓ ప్రైవేటు వ్యక్తికి ఈ స్థలాన్ని కట్టబెట్టేందుకు యత్నించారని, అన్నివర్గాల నుంచి తీవ్ర స్థాయిలో విమర్శలు రావడంతో ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నారని వర్సిటీలోని అధికారులే చెబుతున్నారు.

విద్యార్థులకు దూరంగా వీసీ కార్యాలయం

విద్యార్థులకు ఏవైనా ఇబ్బందులు ఉంటే నేరుగా వీసీ కార్యాలయానికి వచ్చి చెప్పుకునే అవకాశాన్ని ప్రసాదరెడ్డి పూర్తిగా దూరం చేశారన్న విమర్శలు ఉన్నాయి. తాను బాధ్యతలు చేపట్టిన వెంటనే వీసీ కార్యాలయం వద్ద మూడంచెల భద్రతను ఏర్పాటు చేయించారు. ఎవరైనా లోపలకు వెళ్లాలంటే సెక్యూరిటీ అనుమతి తప్పనిసరి. గతంలో ఏవైనా ఇబ్బందులుంటే విద్యార్థి సంఘాలు ఆందోళనలు నిర్వహించేవి. వీసీగా ప్రసాదరెడ్డి వచ్చిన తరువాత అటువంటి పరిస్థితే లేకుండా పోయింది. ఎన్ని ఇబ్బందులు ఉన్నా భరించాల్సిందే తప్ప-బయటకు చెప్పకోలేని పరిస్థితి విద్యార్థులకు ఏర్పడింది. మరోవైపు అధికారుల పర్యవేక్షణలోపం కారణంగా వర్సిటీలో గంజాయి వంటి మత్తుపదార్థాల వినియోగం కూడా పెరిగిపోయింది. సాధారణంగా ప్రభుత్వాలు మారినా రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉన్నవారు ఈ తరహాలో రాజీనామా చేయడం ఎప్పుడూ లేదు. కానీ, వీసీ ప్రసాదరెడ్డి వ్యవహారశైలే అందుకు దారితీసిందన్న అభిప్రాయం సర్వత్రా వినిపిస్తోంది. వీసీ, రిజిస్ట్రార్‌ల రాజీనామాతో విద్యార్థి, అధ్యాపక సంఘాలు ఆనందాన్ని వ్యక్తంచేశాయి. సాయంత్రం ఐదు గంటలకు ఏయూ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో బాణసంచా కాల్చి, స్వీట్లు పంచుకున్నారు. గడిచిన ఐదేళ్ల నుంచి వీసీ ప్రసాదరెడ్డి కబంధ హస్తాల్లో చిక్కుకున్న ఏయూలో ఎట్టకేలకు స్వేచ్ఛాయుత వాతావరణం ఏర్పడిందన్న ఆనందాన్ని వ్యక్తంచేశారు.

వీసీ పోస్టుకు ప్రయత్నాలు

ప్రసాదరెడ్డి రాజీనామా చేయడంతో ఏయూ వీసీ పోస్టు కోసం పలువురు సీనియర్ ప్రొఫెసర్లు ప్రయత్నాలు చేస్తున్నారు. మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వెలగపూడి ఉమామహేశ్వరరావు, శ్రీకాకుళం అంబేడ్కర్ వర్సిటీ వీసీగా పనిచేసి ప్రస్తుతం ఏయూలో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న ప్రొఫెసర్ కూన రాంజీ, ఏయూ ఫారిన్ అఫైర్స్ డీన్‌గా పనిచేస్తున్న ప్రొఫెసర్ ధనుంజయ్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న ప్రొఫెసర్ నరసింహరావు, ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న ప్రొఫెసర్ శశిభూషణ్, తదితరుల పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. ప్రస్తుతానికి ఇన్‌చార్జి వీసీని నియమించి, ఆ తరువాత పూర్తిస్థాయి వీసీ ఎంపిక కోసం సెర్చ్ కమిటీని ప్రభుత్వం వేయనున్నది.

గేమింగ్ డిజార్డర్

... 5వ పేజీ తరువాయి

సెల్‌ఫోన్ పట్టుకుని ఏవో మాట్లాడుతున్నట్టు కనిపించడం, స్కూల్/కళాశాలకు వెళ్లేందుకు ఆసక్తి చూపించకపోవడం, గంటల తరబడి ఫోన్ పట్టుకుని ఉండడం, గందరగోళంగా కనిపించడం, తిండి, నిద్ర పట్ల ఆసక్తి తగ్గడం వంటి లక్షణాలు కనిపించినప్పుడు తల్లిదండ్రులు అప్రమత్తమై వైద్యులు వద్దకు తీసుకువెళ్లి కౌన్సెలింగ్ చేయించాలి. అలాగే వదిలేస్తే ఆందోళన, డిప్రెషన్ వంటివి పెరిగి మానసిక సమస్యలు తలెత్తవచ్చునని వైద్యులు చెబుతున్నారు.

సాధారణ స్థితికి ఇలా..

ఈ లక్షణాలు కనిపించిన వారిని మానసిక వైద్యుల వద్దకు తీసుకువెళితే కౌన్సెలింగ్ ఇచ్చి సాధారణ స్థితికి తీసుకు వస్తారు. అవసరమైతే సమస్య తీవ్రతను బట్టి కొందరికి మందులు కూడా వాడాల్సి ఉంటుంది. రోజువారీ ఆడే గేమింగ్ సమయాన్ని మెల్లగా తగ్గించుకుంటూ వచ్చి చివరికి పూర్తిగా దూరం చేస్తారు. అలాగే, గేమ్ ఆడేటప్పుడు కొందరికి రిలాక్స్ అవుతున్న ఫీలింగ్ కలుగుతుంది. అటువంటి ఫీలింగ్ కలిగించే మందులను ఇవ్వడం ద్వారా ఆ తరహా ఆటలు వైపు వెళ్లకుండా చేస్తారు. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్‌లో ఆడే వారికి ఈ తరహా ఇబ్బందులతోపాటు లక్షలాది రూపాయలు పోగొట్టుకుంటుంటారని, కాబట్టి వారి విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

పెరుగుతున్న కేసులు

- డాక్టర్ ఎన్ఎన్ నీహాల్, మానసిక వైద్య నిపుణులు

ఆన్‌లైన్ గేమింగ్ డిజార్డర్ కేసులు ఈ మధ్యకాలంలో ఎక్కువ అవుతున్నాయి. స్కూల్స్ తెరిచిన తరువాత ఇటు వంటి కేసులు ఎక్కువగా వస్తున్నాయి. స్కూల్స్ కాలేజీలకు వెళ్లేందుకు ఇష్టపడకపోవడం, సెల్‌ఫోన్ ఇవ్వాలని తల్లిదండ్రులను వేధించడం చేస్తున్నారు. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు సకాలంలో గుర్తించడం ద్వారా చిన్నారులను సాధారణ స్థితికి తీసుకువచ్చేందుకు అవకాశం ఉంది. ఆలస్యం అయితే మానసిక సమస్యకు దారితీసే ప్రమాదం ఉంది.

సిటీ పోలీస్ కమిషనర్‌గా శంక బ్రత బాగ్చి

... 5వ పేజీ తరువాయి

ఇబ్బందులు పెట్టారనే ఆరోపణలు సీపీపై ఉన్నాయి. పోలింగ్ జరిగిన తర్వాత కంచరపాలెం బర్మా కాలనీలో టీడీపీకి ఓటేశారనే కారణంతో ఒక కుటుంబంపై కొంతమంది దాడి చేస్తే, ఆ ఘటనకు రాజకీయాలకు సంబంధం లేదని సీపీ తేల్చిపారేశారని కూటమి నేతలు ఆరోపించారు. పైగా దీనిపై ప్రెస్‌మీట్ పెట్టి ఆ గొడవకు వ్యక్తిగత కక్షలే కారణమని సీపీ చెప్పడమే కాకుండా, డీసీపీ-2తో కూడా చెప్పించారని అసంతృప్తి వ్యక్తంచేశారు. ఈ నేపథ్యంలో రవిశంకర్ అయ్యన్నార్ బదిలీ ఖాయమని అంతా భావించారు. ఆయన స్థానంలో ప్రభుత్వం పలువురి పేర్లను పరిశీలించింది. చివరకు శంక బ్రత బాగ్చిని నియమించింది.

కొత్త సీపీది పశ్చిమబెంగాల్ ...

పశ్చిమ బెంగాల్‌కు చెందిన శంక బ్రత బాగ్చి 1996 బ్యాచ్ ఐపీఎస్ అధికారి. ఆయన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తొలుత జమ్మలమడుగు ఏఎస్పీ పనిచేశారు. ఆ తరువాత కడప ఓఎస్‌డీగా, హైదరాబాద్‌లో ఏపీఎస్పీ ఒకటవ బెటాలియన్ కమాండెంట్‌గా, నిజామాబాద్, కర్నూలు, గుంటూరు జిల్లాల ఎస్పీగా, గ్రేహౌండ్స్ డీఐజీగా, సీఐడీ డీఐజీగా పనిచేశారు. సీబీఐకి డిప్యూటేషన్‌పై వెళ్లి కోల్‌కతాలో అత్యంత కీలకమైన కేసులు దర్యాప్తు చేశారు. ఆ తరువాత ఢిల్లీలో సీబీఐ డీఐజీగా సేవలు అందించారు. రాష్ట్ర సర్వీసులకు తిరిగి వచ్చి ఏసీబీ డైరెక్టర్‌గా, ఏపీఎస్పీ, ఇంటెలిజెన్స్ అడిషినల్ డైరెక్టర్ జనరల్‌గా, విజిలెన్స్అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, పర్సనల్ అండ్ అడ్మిన్, అగ్నిమాపక శాఖ ఏడీజీగా పనిచేసిన బాగ్చి ప్రస్తుతం శాంతి భద్రతల ఏడీజీగా ఉన్నారు.

దుర్గమాంబకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో దుర్గమాంబ అమ్మవారు

అగనంపూడి, జూన్ 28: అగనంపూడి ఉక్కు నిర్వాసిత గ్రామాల ఆరాధ్య దేవత దుర్గమాంబకు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్వాహకులు అమ్మవారిని నూతన వస్త్రాలు, పుష్పాలతో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని పూజలు చేశారు. బ్రమరాంబ పారాయణ సేవా సమితి మహిళలు లలితా, విష్ణుసహస్ర నామ పారాయణం చేశారు. ఆలయ కమిటీ ఛైర్మన్ చిత్తా గణేశ్, పారాయణ సేవా సమితి ఆర్గనైజర్ చిత్తా రామారావు, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం రేపు

పెదగంట్యాడ, జూన్ 28: సింహగిరి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం కొత్తగాజువాక సింహగిరి ఆస్పత్రిలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. హాస్పిటల్ ఎండీగా పనిచేసిన డాక్టర్ కేవీ రామన్ వర్ధంతి సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, అన్నిరకాల వ్యాధులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందిస్తామని చారిటబుల్ ట్రస్ట్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ కేవీఎస్ కల్యాణ్‌రామన్ తెలిపారు.

'బాల్య వివాహాలు అనాగరికం'

పెదగంట్యాడ, జూన్ 28: బాల్య వివాహాలు అనాగరికమని, చట్టసమ్మతనం కాదని ఐసీడీఎస్ ప్రాజెక్టు కళాకారులు మహిళలకు బోధించారు. మహిళలు, బాలింతలు, కిశోరబాలికలు, చిన్నారుల, మహిళల హక్కులు, బాలల హక్కులు, చట్టాలను కళారూపాలుగా ప్రదర్శించారు. దయాళ్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో కమిటీ సభ్యులు, మహిళలు, పాల్గొన్నారు.

బాధితుడికి మళ్ల పరామర్శ

మల్కాపురం, జూన్ 28: గ్రేటర్ 58వ వార్డు వైసీపీ మాజీ అధ్యక్షుడు గులిగిందల కృష్ణను పశ్చిమ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే మళ్ల విజయప్రసాద్ శుక్రవారం పరామర్శించారు. ఇటీవల ఆయన అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరి వైద్యసేవలు పొందారు. ఈ నేపథ్యంలో ఆయన కోలుకోవాలని కోరారు. కార్పొరేటర్లు గులిగిందల లావణ్య, పీవీ సురేష్, బల్ల లక్ష్మణరావు, గుండపు నాగేశ్వరరావు, ముర్రువాణి నానాజీ, తదితరులు పాల్గొన్నారు.

నిరాశ్రయులకు స్వెట్టర్లు పంపిణీ

పెందుర్తి, జూన్ 28: జైభారత్ జాతీయ పార్టీ పెందుర్తి నియోజకవర్గ అధ్యక్ష, సమన్వయకర్త సింగపల్లి రవితేజ, కన్నేపల్లి మహదేవ్ కళ్యాణ్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు శుక్రవారం నిరాశ్రయులకు స్వెట్టర్లు పంపిణీ చేశారు. పెందుర్తి నుంచి విశాఖ వరకు బిచ్చగాళ్ల. అనాథలు, నిరాశ్రయులైన 700 మందికి ఆహార పొట్లాలు, స్వెట్టర్లు అందజేశారు.

బోరు బావులకు శంకుస్థాపన

కూర్మన్నపాలెం, జూన్ 28: జీవీఎంసీ 88వ వార్డు జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో శుక్రవారం కార్పొరేటర్ మొల్లి ముత్యాలునాయుడు ఆధ్వర్యంలో బోరు బావులకు శంకుస్థాపన చేశారు. తాగునీటి సమస్య పరిష్కరించే దిశగా ఈ బోరుల పనులను ప్రారంభించామన్నారు. ప్రజా సంక్షేమమే టీడీపీ ధ్యేయమన్నారు. వార్డును సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. ప్రజా సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు ముమ్మిడివరపు రాము, ఉరుకూటి శ్రీను, ఎర్నిబాబు, ఒమ్మి రాము తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **మహరాజ :** మెలోడి, శరత్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మీ (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), లిఖిత (శ్రీహరిపురం), తాతా సీతారామయ్య (పరవాడ), (తగరపువలస)
- **ప్రభుత్వ జూనియర్ కళాశాల :** రమాదేవి, వెంకటేశ్వర, నరసింహ (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక),
- **మనమే :** జగదాంబ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మినీమోహిని (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్ (తగరపువలస)
- **హరోం హర :** శ్రీరామ, శారద, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మోహిని (గాజువాక)
- **హనీమూన్ ఎక్స్‌ప్రెస్ :** రమాదేవి, శ్రీనరసింహ (గోపాలపట్నం), విశేష్ (గాజువాక)
- **ఒఎంజి :** శ్రీవెంకటేశ్వర, సంగం, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మోహిని (గాజువాక), రాములమ్మ (తగరపువలస)
- **భజే వాయు వేగం :** శ్రీవెంకటేశ్వర, మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 35, టమాటా 46, వంకాయలు (తెలుపు) 38, వంకాయలు (నలుపు) 38, బెండకాయలు 28, పచ్చిమిర్చి 84, కాకరకాయలు 48, బీరకాయలు 45, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 40, క్యాబేజి 30, క్యారెట్ 38, దొండకాయలు 26, బంగాళదుంపలు 32, అరటికాయ 6, మునక్కాడలు (కిలో) 110, అల్లం 150, బరబాటి 60, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 75, గోరుచిక్కుడు 38, దోసకాయలు 18, వెల్లుల్లి 180, కొబ్బరికాయ 23, బీన్స్ (పెన్సిల్) 126, పొటల్స్ 32, కీరదోస 32, కాప్సికమ్ 70, పొట్లకాయ 20, చేమదుంపలు 40, చిలగడదుంపలు 38, కంద 60, దేముడు చిక్కుడు 84, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 28, క్యాప్సికం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 33, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	530
విజయనగరం	534
శ్రీకాకుళం	534

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	120
ఫారం ధర	--	140
విత్ స్కిన్	--	250
స్కిన్‌లెస్	--	260

మరికొన్ని సిటీ వార్తలు పేజీ 10లో..



పల్లా శ్రీనివాసరావుని సత్కరిస్తున్న సర్వసిద్ధి అనంతలక్ష్మి



పల్లాకు అభినందనలు తెలియజేస్తున్న కనకభవానీ తదితరులు

పల్లా శ్రీనివాసరావుకు అభినందనల వెల్లువ

గాజువాక, జూన్ 28: తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షునిగా బాధ్యతలు స్వీకరించిన గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును 86వ వార్డు ఇన్‌చార్జి నల్లూరు సూర్యనారాయణ శుక్రవారం పార్టీ కేంద్ర కార్యాలయంలో కలిసి అభినందనలు తెలిపారు. గాజువాక ప్రాంతానికి చెందిన నేతకు రాష్ట్ర స్థాయిలో అత్యున్నత పదవిని ముఖ్యమంత్రి చంద్రబాబు కేటాయించడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ప్రజా సేవ చేసే వారికి పార్టీలో తగిన గుర్తింపు ఉందనడానికి ఇదే నిదర్శనమని ఈ సందర్భంగా నల్లూరు పేర్కొన్నారు.

అగనంపూడి: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా మంగళగిరిలో శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును అగనంపూడి ప్రాంత నాయకులు కలిసి అభినందనలు తెలియజేశారు. 79వ వార్డు టీడీపీ మహిళా అధ్యక్షురాలు గొల్లవిల్లి కనకభవానీ పల్లాను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ 85వ వార్డు అధ్యక్షుడు కర్రి దేశేంద్ర అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గొల్లవిల్లి వెంకటరావు, నాగార్జున, కనిపల్లి శ్రీను, పలకాఅచ్యుత్, చందురమేశ్, తదితరులు పాల్గొన్నారు.



పల్లాను అభినందిస్తున్న నల్లూరు సూర్యనారాయణ

68, 69వ వార్డు నాయకులు

అక్కిరెడ్డిపాలెం: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా మంగళగిరిలో శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుని 68, 69 వార్డులకు చెందిన పార్టీ నాయకులు కలిసి, ఘనంగా అభినందించారు. తెలుగు మహిళ విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షురాలు సర్వసిద్ధి అనంతలక్ష్మి, జిల్లా నాయకులు ఈటి శ్రీను, గోపిశెట్టి గోపి, అక్కిరెడ్డి శ్రీను, గండికోట తాతారావు, లంక మురళీ, తదితరులు పల్లా శ్రీనివాసరావును అభినందించిన వారిలో ఉన్నారు.

'అక్షరయోధుడు రామోజీరావు'



రామోజీరావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పిస్తున్న నేతలు

పెదగంట్యాడ, జూన్ 28: తెలుగు భాషను సరళీకృతం చేసి అక్షరజ్ఞానం ఉన్నవారికి అర్థమయ్యే రీతిలో తీర్చిదిద్దిన అక్షరయోధుడు రామోజీరావు అని జీవీఎంసీ 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి అన్నారు. పెదగంట్యాడ టీడీపీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన రామోజీ సంస్మరణ సభలో ఆమె మాట్లాడుతూ తెలుగు అక్షరాల్లో సరళాలను మాండలిక భాషతో సమ్మిళితం చేసి సామాన్యులను ఆలోచింపచేసే కథనాలు పాఠకులకు అందించారన్నారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పులి వెంకటరమణారెడ్డి, నేతలు దొమ్మేటి అప్పారావు, నాగప్రసాద్, గురప్ప, అప్పారావు, వెంకటరావు, గురునాధరావు తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు రామోజీరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి



విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులను అందజేస్తున్న సర్పంచ్ నాగమణి

అగనంపూడి, జూన్ 28: పెదముషిడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాలను శుక్రవారం సర్పంచ్ పల్లా నాగమణి పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రభుత్వ అందిస్తున్న సదుపాయాలతో విద్యార్థులు చక్కగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. ఈకార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు ఒమ్మి వెంకటరావు, ఉపసర్పంచ్ అలమండ వెంకటలక్ష్మి, స్థానిక నాయకులు యలమర్తి బుజ్జి, అలమండ నారాయణరావు, హెచ్ఎం కృష్ణ, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటుపరం చేయొద్దు'



రిలే నిరాహార దీక్షల శిబిరంలో పాల్గొన్న ఉక్కు కార్మికులు

కూర్మన్నపాలెం, జూన్ 28: విశాఖ ఉక్కు కర్మాగారానికి సొంత గనులు కేటాయించినట్లయితే పురోభివృద్ధి సాధిస్తుందని, ఇలాంటి కల్పతరు వైన ప్రభుత్వ రంగ సంస్థను ప్రైవేటీకరించవద్దని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఛైర్మన్ డి. ఆదినారాయణ సూచించారు. కూర్మన్నపాలెంలో 1233వ రోజు శుక్రవారం రిలే నిరాహార దీక్షల శిబిరంలో పాల్గొన్న కార్మికుల నుద్దేశించి ఆయన మాట్లాడారు. విశాఖ ఉక్కు కర్మాగార ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అలుపెరగని పోరాటం చేస్తున్న కార్మికులకు ముందుగా అభినందనలు తెలిపారు. కార్మికులు ఇటీవల చేపట్టిన మానవహారాలు, రాస్తారోకోలు, ధర్నాలు కార్మికుల ఐక్యతచాటి చెప్పాయన్నారు. ఇలాంటి పోరాటాలతోనే విజయాలు వరిస్తాయన్నారు. కార్మికుల ఆత్మ విశ్వాసంతో విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరణ నుంచి రక్షించుకోగలమన్న ధీమాను వ్యక్తం చేశారు. ఇకనైనా కేంద్ర ప్రభుత్వం తమ మొండి వైఖరిని మార్చుకోవాలని హితవు పలికారు. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తిరుమలనగర్ కాలనీలో స్వచ్ఛ భారత్

కూర్మన్నపాలెం, జూన్ 28: తిరుమలనగర్‌లో శుక్రవారం కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో పార్కుల్లో శుక్రవారం స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. చిన్నారులు, వృద్ధులు, యువత, మహిళలు పార్కుల్లో చెత్తాచెదారాలను, ముళ్ల కంచెలను తొలగించారు. అనంతరం స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ ప్రతినిధి పరమానందం మాట్లాడుతూ తడి-పొడి చెత్తను వేరు చేసి జీవీఎంసీ సిబ్బందికి అందించాలన్నారు. ఇళ్లల్లో సేంద్రియ పద్ధతిలో ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు పండించే విధానాలను వివరించారు. ఇంకుడు గుంతలతో ప్రయోజనాలు, పాలిథిన్ వాడకంతో నష్టాలను తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు నాగభూషణం, విశ్వేశ్వరరావు, పరమేశ్వరరావు, సన్యాసిరావు, వర్మ, జగన్నాథం, భద్రరావు, భాస్కరరావు, అప్పలనాయుడు, సన్యాసిరావు, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



స్వచ్ఛ భారత్‌లో పాల్గొన్న కాలనీ వాసులు

నేటి నుంచి గ్రీన్‌సిటీలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు

కూర్మన్నపాలెం, జూన్ 28: జీవీఎంసీ 88వార్డు గ్రీన్‌సిటీ శ్రీలక్ష్మీ ఆండాళ్ సమేత వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 29 నుంచి జూలై 5 వరకు 13వ వార్షిక బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నట్టు వైజాగ్ ప్రొఫైల్స్ డైరెక్టర్ వీవీ కృష్ణారావు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా శనివారం విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, పరిషత్, రక్షా బంధనం, అంకురార్పన, 30న గరుడ పతాక ధ్వజారోహణం, ఊరేగింపు, శ్రీవారి కల్యాణం, 1న సామూహిక కుంకుమ పూజలు, శ్రీవారి ఊరేగింపు, 2న సామూహిక వ్రతాలు, కల్ప వృక్ష వాహన సేవ, కోలాటాలు, సుదర్శన హోమం, 3న లక్ష మల్లెలతో పుష్పార్చన, గజవాహనంపై శ్రీవారి ఊరేగింపు, కోలాటాలు, 4న హనుమత్ వాహన సేవ, శ్రీ పుష్ప యాగం, మహా పూర్ణాహుతి, 5న అన్న సమారాధన, అన్నమయ్య సంకీర్తనలుంటాయన్నారు. కమిటీ ఆధ్వర్యంలో అర్చకులు ఇరగవరపు వాసు, శ్రీధర్ పర్యవేక్షణలో వేడుకలు సాగుతాయన్నారు.





ముస్తాబైన గ్రీన్‌సిటీలో శ్రీవారి ఆలయం, పూజలందుకుంటున్న శ్రీమహాలక్ష్మి అమ్మవారు

వెంకన్నకు పంచామృతాభిషేకాలు

పెందుర్తి: పెందుర్తి వెంకటాద్రి శిఖరంపై కొలువైన వెంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున స్వామి విగ్రహాన్ని పంచామృతాలతో అభిషేకరించారు. ఎన్ఆర్ఐ భక్తులు సమర్పించిన వెండి యజ్ఞోపవీతాన్ని స్వామికి ధారణ చేశారు.

ప్రభుత్వ స్థలం కబ్జాకు యత్నం

- మార్కెట్ ధర సుమారు రూ.5 కోట్లు
- ఉడా ఫేజ్-5లో వెలుగుచూసిన అక్రమం

కూర్మన్నపాలెం, జూన్ 28: ప్రభుత్వ స్థలం కనిపిస్తే చాలు కబ్జా రాయుళ్లు పేట్రేగిపోతున్నారు. జీవీఎంసీ 86వ వార్డు ఉడా ఫేజ్-5లో పలు ప్రభుత్వ స్థలాలు ఖాళీగా ఉండడంతో వాటిపై ఆక్రమణదారులు కన్నేశారు. ఇటీవల ఆ స్థలంలో నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. కూర్మన్నపాలెం సర్వే నంబరు 32లో సుమారు 1000 చదరపు గజాలకుపైగా ప్రభుత్వ స్థలం ఖాళీగా ఉంది.

గతంలో ఆ స్థలాన్ని మినీ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు కేటాయించాలని గాజువాక రెవెన్యూ ఉన్నతాధికారులకు విద్యుత్ అధికారులు నివేదించారు. సామాజిక అవసరాలకు ఈ సర్వే నంబరులో కేటాయింపులు జరిగాయంటూ కాలనీ వాసులు అడ్డుకోవటంతో సబ్‌స్టేషన్‌కు కేటాయించలేదు. ఆ స్థలంలో కల్యాణ మండపం, పాఠశాల, అబ్దుల్ కలాం గ్రంథాలయం నిర్మించాలని కాలనీవాసులు పలుమార్లు విన్నవించినా అధికారులు పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో కబ్జా రాయుళ్లు రంగ ప్రవేశం చేశారు. పకీరుతక్యాకు చెందిన ఓ వ్యక్తి ఈ స్థలాన్ని కబ్జా చేసేందుకు విఫలయత్నాలు చేస్తున్నాడు. గతంలో ఇక్కడ రేకుల షెడ్డు నిర్మించేందుకు ప్రయత్నించగా సీపీఎం నాయకులు ధర్నా చేశారు. దీంతో చేసేది లేక అధికారులు షెడ్డు తొలగించారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఇదే సర్వే నంబరులోని మరో రెండువేల చదరపు గజాలను కొంతమంది ఆక్రమించి రాత్రికి రాత్రే ప్రహరీ నిర్మించారు. దానిపై ఫిర్యాదులు వెల్లువెత్తడంతో ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ పర్యటించి, గాజువాక రెవెన్యూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థలాన్ని రీ సర్వే చేయించి ప్రహరీని తొలగించి, హెచ్చరిక బోర్డు పెట్టాలని ఆదేశించారు. ఆ తరువాత కబ్జారాయుళ్లు స్తబ్దుగా ఉన్నప్పటికీ గత కొద్దిరోజులుగా మళ్లీ అక్రమానికి తెరతీశారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి విలువైన ప్రభుత్వ స్థలాలను పరిరక్షించాలని కోరుతున్నారు.



ఉడాఫేజ్-5లో కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ స్థలం

చర్యలు తీసుకుంటాం



ఉడాఫేజ్-5 ప్రభుత్వ స్థలాల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదు. ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం. ఎంతటి వారైనా ఉపేక్షించం. గతంలో ఫిర్యాదులు వస్తే ఆక్రమణలను తొలగించి హెచ్చరిక బోర్డులు పెట్టాం.

\- టి.శ్రీవల్లి, తహసీల్దార్, గాజువాక

సమస్యల పరిష్కారానికి కృషి: ఎమ్మెల్యే గణబాబు



వెంకటాపురంలో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే గణబాబు

గోపాలపట్నం, జూన్ 28: గ్రేటర్ 92వ వార్డు వెంకటాపురంలో పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు, జీవీఎంసీ అధికారులు శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా వీధుల్లో పర్యటించి స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వీధిదీపాల నిర్వహణ, తాగునీటి సరఫరా పై ఆరాతీశారు. గ్రామంలో శిథిలావస్థలో ఉన్న ఓవర్ హెడ్ ట్యాంక్‌ను తొలగించాలని, శ్మశాన వాటికకు ప్రహరీ నిర్మాణం చేపట్టాలని ఎమ్మెల్యే ఆదేశించారు. గ్రామంలో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించేలా చర్యలు చేపట్టనున్నట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో జడ్సీ కె.హేమవతి, అధికారులు, వార్డు నాయకులు పాల్గొన్నారు.

తులాభారంతో మొక్కు తీర్చుకున్న ఎమ్మెల్యే బండారు



ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తికి తులాభారం

వేపగుంట, జూన్ 28: మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి పేరిట వేపగుంట టీడీపీ నాయకులు మొక్కులను చెల్లించారు. శుక్రవారం ఉదయం ముత్యాలమ్మ ఆలయంలో బండారు సత్యనారాయణమూర్తికి 65 కిలోల బెల్లంతో తులాభారం వేశారు. అనంతరం అమ్మవారికి పూజలు, మధ్యాహ్నం అన్న సమారాధన చేశారు. ఈ కార్యక్రమంతో కార్పొరేటర్ రాపర్తి కన్నానేతలు ముత్యాలనాయుడు, దివాకర్, నరసింహనాయుడు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం



అన్నసమారాధన ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు

పెందుర్తి, జూన్ 28: చినముషిడివాడ కూడలిలోని పంచముఖ వీరాంజనేయ 14వ వార్షిక మహోత్సవం శుక్రవారం ఆలయ శాశ్వత ధర్మకర్త శేనాపతి శంకరరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్వామికి పంచామృతాభిషేకాలు, సింధూరార్చన చేశారు. పెందుర్తి, మాడుగుల, పశ్చిమ ఎమ్మెల్యేలు పంచకర్ల రమేశ్‌బాబు, బండారు సత్యనారాయణమూర్తి, గణబాబు స్వామిని దర్శించుకున్నారు. అనంతరం అన్నసమారాధనను ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు ప్రారంభించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో మారుతీ భక్త బృందం హనుమాన్ చాలీసా పఠించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ శేనాపతి వసంత, శేనాపతి సోమశేఖర్, పిన్నింటి పార్వతి, అయిత సింహాచలం పాల్గొన్నారు.

సెయిల్ డైరెక్టర్‌ను కలిసిన ఉక్కు నేతలు



సెయిల్ డైరెక్టర్‌తో ఉక్కు నేతలు కేఎస్ఎన్ రావు, తదితరులు

ఉక్కుటౌన్‌షిప్, జూన్ 28: సెయిల్ ఇండిపెండెంట్ డైరెక్టర్ ఎస్.కాశీవిశ్వనాథరాజును శుక్రవారం నగరంలో విశాఖ స్టీల్‌ప్లాంట్ గుర్తింపు యూనియన్ అధ్యక్షుడు కేఎస్ఎన్ నేతృత్వంలో నాయకులు కలిశారు. సెయిల్‌లో స్టీల్‌ప్లాంట్‌ను విలీనం చేయాలని కోరారు. ఈ మేరకు కేంద్ర ఉక్కుశాఖ మంత్రి కుమారస్వామికి వినతిపత్రం అందజేసిన సందర్భంగా అభినందనలు తెలిపారు. స్టీల్‌ప్లాంట్‌కు అన్నివిధాలా న్యాయం చేస్తామని డైరెక్టర్ హామీ ఇచ్చినట్టు వారు వివరించారు. డైరెక్టర్‌ను కలిసిన వారిలో బి.కామేశ్వరరావు, డొక్కా నరసింగరావు, చీకటి శ్రీనివాసరావు, గణపతివర్మ ఉన్నారు.

నేటి నుంచి సురభి నాటకాలు

- వారం రోజుల పాటు నిర్వహణ
- ప్రేక్షకులకు ఉచిత ప్రవేశం



సమావేశంలో మాట్లాడుతున్న బాదంగీర్ సాయి, తదితరులు

డాబాగార్డెన్స్, జూన్ 28: రంగసాయి నాటక సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 29 నుంచి మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో వారం రోజుల పాటు సురభి నాటకోత్సవాలు నిర్వహించనున్నట్టు వ్యవస్థాపకులు బాదంగీర్ సాయి తెలియజేశారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ప్రతిరోజూ సాయంత్రం 6 గంటల నుంచి 9 గంటల వరకు జరిగే కార్యక్రమంలో భాగంగా 29న మాయాబజార్, 30న భక్తప్రహ్లాద, జూలై ఒకటిన లవకుశ, 2న భూకైలాస్, 3న పాతాళభైరవి, 4న శ్రీకృష్ణ లీలలు, 7న మాయాబజార్ నాటకాలను ప్రదర్శిస్తామన్నారు. నిర్వాహకులుగా బాదంగీర్‌సాయి, ఎన్.నాగేశ్వరరావు వ్యవహరిస్తారన్నారు. ప్రేక్షకులకు ఉచితంగా తిలకించే అవకాశం కల్పిస్తున్నామన్నారు. సమావేశంలో వర్రె నాంచారయ్య, శివజ్యోతి, రమేష్‌యాదవ్, రవిబ్రహ్మ పాల్గొన్నారు.

కల్యాణ మండపాలు లేక ఇక్కట్లు

కూర్మన్నపాలెం, జూన్ 28: జీవీఎంసీ 86వ వార్డు వుడానగర్ ఫేజ్-1లో కల్యాణ మండపం ఏర్పాటు చేయాలని కాలనీ వాసులు కోరుతున్నారు. యాతపాలెం, ఉడాఫేజ్ 1-7, రాసాలమ్మ కాలనీ, రాజీవ్‌నగర్, కాపుజగ్గరాజుపేట, డాక్‌యార్డు కాలనీ, సైమాన్‌నగర్, యాదవజగ్గరాజుపేట, జూపిల్లినగర్, శ్రీ కృష్ణనగర్ వరకు గల జనాలు కల్యాణమండపం కోసం గతంలో వుడా అధికారులకు పలు మార్లు వినతి పత్రాలు అందజేశారు. ఈ ప్రాంతంలో కల్యాణ మండపం లేక స్థానికులు గాజువాక, స్టీల్‌ప్లాంట్‌లో ఉన్న కళ్యాణమండపాలకు వెళ్లాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. వడ్లపూడిలో ఉన్న ఏకైక జీవీఎంసీ కల్యాణ మండపాన్ని సచివాలయంగా మార్చి వేశారు. రహదారులు పైనే పెళ్లిళ్లు, ఇతర శుభకార్యక్రమాలు చేయాల్సిన దుస్థితి నెలకొంటోందని పలు గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి కల్యాణ మండపం నిర్మించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

ఘనంగా రాజా విక్రమ్‌దేవ్‌వర్మ జయంతి



విగ్రహం ఎదుట నివాళులర్పిస్తున్న దృశ్యం

డాబాగార్డెన్స్, జూన్ 28: ఆంధ్ర విశ్వ కళాపరిషత్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన రాజా విక్రమ్‌దేవవర్మ విగ్రహం వద్ద రాజావారి 155వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విక్రమ్‌దేవ్ వర్మ మనుమరాలు, జైపూర్ రాజమాత మయాంక్ కుమారి దేవ్ మాట్లాడుతూ.. రాజా విక్రమ్‌దేవ్‌వర్మ విద్య, సామాజిక రంగాల్లో చేసిన సేవలను వివరించారు. ఆంధ్ర యూనివర్సిటీ, ఒడిశాలో ఉత్కల్ యూనివర్సిటీ ఏర్పాటుకు ఆయన వందలాది ఎకరాల భూమిని విరాళంగా అందజేశారన్నారు. సాహితీపరంగా ప్రబంధ కావ్యాలను రచించారన్నారు. సోమవారం ఏయూలోని పాఠశాలలో రాజావారిపేరుపై విద్యార్థులకు పుస్తకాలు, జామెట్రీబాక్సులు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జైపూర్ యువరాణి లతికాదేవ్, రాజవంశీయులు వివేక్, లతికా డియో, చిట్టూరి గిరిధర్, రవి ప్రకాష్ బెయిద్, ఎ.వెంకటరామన్, సురేంద్ర పాల్గొన్నారు.

తెలుగు వారు గర్వపడే నేత పీవీ



పీవీ వి గ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

మహారాణిపేట, జూన్ 28: ప్రపంచంలో తెలుగువారికి గుర్తింపు తెచ్చిన మహనీయుడు దివంగత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు అని మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ అన్నారు. శుక్రవారం మాజీ ప్రధాన మంత్రి, భారత రత్న పీవీ 103 వ జయంతి సందర్భంగా గవర్నర్ బంగ్లా వద్ద గల ఆయన విగ్రహానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం ఆర్థిక పరిస్థితి క్లిష్టంగా ఉన్న సమయంలో పీవీ సంస్కరణలు అమలు చేసి దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించారని కొనియాడారు.ఈ కార్యక్రమంలో లంకా శ్రీనివాసరావు దాడిలక్ష్మణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు తొలగింపు

సీతమ్మధార, జూన్ 28: నక్కవానిపాలెంలోక భవనం సెల్లార్‌లో అక్రమ నిర్మాణాలను జీవీఎంసీ సిబ్బంది శుక్రవారం తొలగించారు. ఓ మూడంతస్తుల భవనంలో నిబంధనలకు విరుద్ధంగా సెల్లార్ స్థలంలో గదులు కట్టడంతో ఆ నిర్మాణాలను తొలిగించినట్టు టౌన్ ప్లానింగ్ సెక్రటరీలు వెంకటలక్ష్మి, సందీప్, హరీష్‌లు తెలిపారు. పార్కింగ్ కింద చూపించిన స్థలంలో ఈ అక్రమ నిర్మాణం చేపట్టినట్టు వారు చెప్పారు.

డిపోలకు బియ్యం పంపండి: డీఎస్‌వో

విశాఖపట్నం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): తెల్ల రేషన్ కార్డుదారులకు వచ్చేనెల ఒకటోతేదీ నుంచి బియ్యం పంపిణీకి ఇబ్బందులకుండా నక్కరం రవాణా చేయాలని గోదాము ఇన్‌చార్జులకు జిల్లా పౌరసరఫరాల అధికారి గూన సూర్యప్రకాశరావు ఆదేశించారు. శుక్రవారం మర్రిపాలెంలో పౌరసరఫరాల సంస్థ పరిధిలో రెండు గోదాములను ఆయన సందర్శించారు. నగరంలో చాలా డిపోలకు ఇంకా బియ్యం సరఫరా జరగలేదని పేర్కొన్నారు. ఈస్టిలో లోడింగ్‌లో వేగం పెంచాలన్నారు.జిల్లాలో 641 రేషన్‌డిపోలకుగాను ఇంత వరకు 346 డిపోలకు బియ్యం సరఫరా జరిగిందని, శని, ఆదివారాల్లో మిగిలినడిపోలకు సరకులందించాలని ఆదేశించారు.

జల్‌జీవన్‌లో అక్రమాలు

... 5వ పేజీ తరువాయి

అత్యంతరాలు రావడంలో సదరు నేత అప్రమత్తమయ్యారు. పైపుల్లో లోపాలను గుర్తించిన అధికారులపై ఒత్తిడి తీసుకురావడంతోపాటు బెదిరించారు. అయినా అధికారులు నాసిరకం పైపుల విషయంలో వెనక్కి తగ్గలేదు. ఈ నేపథ్యంలో జల్‌జీవన్ మిషన్ పనుల్లో వినియోగించే పైపుల తనిఖీ చేసే బాధ్యత నుంచి క్వాలిటీ కంట్రోల్ అధికారులను తప్పించేలా సదరు నేత ప్రభుత్వంలో లాబీయింగ్ చేశారు. ఈ మేరకు పైపుల నాణ్యత తనిఖీ అధికారం నుంచి గత ఏడాది అక్టోబరులో క్వాలిటీ కంట్రోల్ సెక్షన్ తప్పించిన ప్రభుత్వం ఆ బాధ్యత రెగ్యులర్ ఇంజనీర్లకు అప్పగించింది. దీనిపై అప్పట్లో అనేక అనుమానాలు వ్యక్తమైనా ఎవరూ నోరు విప్పలేదు. జిల్లాలో చేపట్టిన పనుల్లో చాలాచోట్ల లోపాలున్నట్టు గుర్తించినా చర్యలు తీసుకోలేదు. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో జలజీవన్ మిషన్ పనులు, పైపుల్లో లోపాలపై విచారణ చేయాలని పలువురు సర్పంచులు కోరుతున్నారు. ఈ విషయం గ్రామీణ నీటి సరఫరా విభాగం ఇన్‌చార్జి ఎస్ఈ కృష్ణారెడ్డి వద్ద ప్రస్తావించగా ప్రభుత్వం నిర్దేశించిన మేరకు పనులు చేపట్టామన్నారు.

టర్నర్ చౌల్ట్రీ వద్ద కనిపించని బస్ షెల్టర్

» రోడ్డు విస్తరణలో తొలగింపు

» దేవదాయ శాఖ స్థలంలో విశాఖ బజారు ఏర్పాటుతో అవస్థలు

జగదాంబ కూడలి, జూన్ 28: వన్‌టౌన్‌లోని టర్నర్ చౌల్ట్రీ వద్ద ఆర్టీసీ బస్ షెల్టర్ కనుమరుగైంది. ప్రైవేటు సిటీ బస్సు సర్వీసులు తిరిగినప్పటినుంచి ప్రయాణికులకు ఇక్కడ బస్ షెల్టర్ ఉండేది. సూపర్ బజార్ మెయిన్ రోడ్డు వైపు దేవదాయ శాఖకు చెందిన స్థలం ఎదుట టర్నర్ చౌల్ట్రీ వద్ద విశాఖ బజార్ నిర్మించడంతో ఈ బస్ షెల్టర్ ప్రస్తుతం కనిపించకుండా చేశారు. రోడ్డు విస్తరణలో భాగంగా దీనిని తొలగించిగా, అక్కడే ఓ షాపును మాత్రం ఉంచేశారు. రోజూ ఎంతో మందికి ఉపయోగపడే బస్ షెల్టర్ లేకుండా చేసిన దేవదాయ అధికారులపై ప్రయాణికులు అసహనం వ్యక్తంచేస్తున్నారు. అలాగే, అధికారులు వన్‌టౌన్ పరిధిలో రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా చాలాచోట్ల ఆర్టీసీ ప్రయాణికుల బస్‌షెల్టర్లను తొలగించారు.



గతంలో బస్సు షెల్టర్ ఉన్నచోట దేవదాయశాఖ షాపులు

వన్‌టౌన్‌లో పలుచోట్ల ఇదే పరిస్థితి..

పూర్ణామార్కెట్, రీడింగ్ రూమ్, కురుపాం మార్కెట్ పాతపోస్టాఫీసుకు వెళ్లే ప్రయాణికులు పలుచోట్ల బస్ షెల్టర్లు లేక ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. గత ప్రభుత్వం పలుచోట్ల బస్‌బేల పేరుతో ఆర్భాటంగా నిర్మాణాలు చేపట్టినా వన్‌టౌన్‌లో మాత్రం వాటి ఆచూకీ లేకుండా చేయడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. జగదాంబ వద్ద లక్ష్మీమాల్ నుంచి పాతపోస్టాఫీసు వరకు ఎక్కడా బస్ షెల్టర్లు నిర్మించకపోవడంతో ప్రయాణికులకు ఎండావానలనుంచి రక్షణ కరువైంది. జోన్-4 ఇంజనీరింగ్ అధికారులు వర్షే పాతనగరంలో ఈ దుస్థితి నెలకొందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం హయాంలోనైనా వన్‌టౌన్ ప్రాంతంలో బస్ షెల్టర్లు నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

అలరించిన భువన విజయం సాహితీ రూపకం



నాటకంలో ఓ సన్నివేశం

అక్కయ్యపాలెం, జూన్ 28: గురుపు ఆరాధనోత్సవాల్లో భాగంగా లలితాపీఠంలో శుక్రవారం రాత్రి హైదరాబాద్‌కు చెందిన అక్కిరాజు సుందర రామకృష్ణంరాజు బృంద కళాకారులు ప్రదర్శించిన భువన విజయం సాహితీ రూపకం అప్పటి వైభవాన్ని ప్రేక్షకుల కళ్లకు కట్టినట్టు చూపారు. శ్రీకృష్ణదేవరాయల కాలానికి తీసుకువెళ్లేలా రసానందనుభ లోను చేశారు. డాక్టర్ అక్కిరాజు సుందర రామకృష్ణంరాజు శ్రీకృష్ణదేవరాయలుగా అద్భుతమైన రాజసం, ఆహార్యంతో ఆకట్టుకున్నారు. అలాగే, అప్పాజీగా ముదిగొండ శివప్రసాద్, అల్లసాని పెద్దనగా పంద్రంగుల శ్రీనివాస్, మల్లనగా భాస్కరరబిల్లి, అయ్యలరాజుగా కె.చంద్రశేఖరం, పింగళి సూరనగా చొదరి నరసింహారావు, నంది తిమ్మనగా మల్లాది వెంకట గోపాలకృష్ణ, ధూర్జటిగా యెల్లంరాజు త్యాగరాజ, భట్టుమూర్తిగా సీఎంకే గాంధీ, తెనాలి రామకృష్ణుడిగా మావుడూరు సూర్యనారాయణ మూర్తి అద్భుత ఆహార్యం, పద్యాల పఠనంతో అలరించారు. కర్ణాటక శంకరాచార్యులు నిర్వేశ్వరానంద భారతీ మహాస్వామి సమక్షంలో జరిగిన ఈ సాహితీ రూపకాన్ని పలువురు భక్తులు, సాహితీ వేత్తలు వీక్షించారు. ఈ కార్యక్రమాన్ని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ పర్యవేక్షించారు. శక్తి పీఠాధీశ్వరి రమ్యానంద భారతీ స్వామిని పాల్గొన్నారు.

ఆర్టీసీ సిబ్బందిపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



డీజీపీ ద్వారకా తిరుమలరావును సన్మానిస్తున్న ఎన్ఎంయూ నాయకులు

ద్వారకాబస్‌స్టేషన్, జూన్ 28: విధి నిర్వహణలో ఉన్న ఆర్టీసీ సిబ్బందిపై దాడులకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు డీజీపీ ద్వారకా తిరుమలరావును కోరారు. నూతన డీజీపీగా నియమితులైన తిరుమలరావును అసోసియేషన్ నాయకులు శుక్రవారం ఆయన కార్యాలయంలో కలిసి సత్కరించారు. అనంతరం వినతి పత్రమిచ్చారు. ఆర్టీసీ డ్రైవర్ తప్పు లేకున్నా, పెద్ద వెహికల్ పేరిట అన్యాయంగా వారిపై కేసులు పెడుతున్నారన్నారు. ఇలాంటి వాటికి తావులేకుండా అన్ని జిల్లాల పోలీస్ అధికారులకు ఆదేశాలివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసరాజు, కోశాధికారి టీవీవీ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఏయూను భ్రష్టుపట్టించారు

» వీసీ ప్రసాదరెడ్డి వ్యవహారశైలిపై 'ఎక్స్' వేదికగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆగ్రహం

విశాఖపట్నం, జూన్ 28: ప్రతిష్ఠాత్మకమైన ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రమాణాలు దిగజార్చిన వీసీజీవీ ప్రసాదరెడ్డి వైస్ చాన్సలర్‌గా కొనసాగడానికి అనర్హులని మానవ వనరుల శాఖ మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పేర్కొన్నారు. శుక్రవారం 'ఎక్స్' వేదికగా చేసిన ట్వీట్‌లో వివిధ అంశాలపై ప్రసాదరెడ్డి తీరును విమర్శించారు. ఆంధ్ర ప్రజలు 93 శాతం సీట్లతో కూటమిని ఆశీర్వదిస్తే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఫొటోను వీసీ తన చాంబర్‌లో పెట్టకపోవడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. విద్యార్థులకు, ఉద్యోగులకు ఆదర్శంగా ఉండాల్సిన వ్యక్తి వైసీపీ కార్యకర్తలాగే ఎక్కువగా ఆ పార్టీతో అంటకాగారని విమర్శించారు.ఐదేళ్లలో యూనివర్సిటీ ప్రతిష్ఠను దిగజార్చారన్నారు. ల్యాబ్‌లు, ఈ-క్లాస్‌రూమ్‌లు, రీసెర్చ్, విద్యా ప్రమాణాలు పెంచడం కోసం ఇచ్చిన వందల కోట్ల రూపాయల రూసా నిధులను ఇతర పనులకు మళ్లించి ప్రసాదరెడ్డి దుర్వినియోగం చేశారని గంటా ఆరోపించారు. ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో సాధారణ లెక్చరర్‌గా ఉన్న ప్లేసెన్సు తీసుకొచ్చి నిబంధనలకు వ్యతిరేకంగా అంబేడ్కర్ చైర్ ప్రొఫెసర్‌గా నియమించారన్నారు. అనంతరం ఎంతోమంది సీనియర్ ప్రొఫెసర్లు యూనివర్సిటీలో ఉన్నా సీనియర్‌ను రిజిస్ట్రార్‌గా నియమించడం వైస్ చాన్సలర్ అధికార దుర్వినియోగానికి నిదర్శనమన్నారు.

అర్హులను వదిలేసి రిటైర్డ్ ఉద్యోగులకు పునరావాసం

యూనివర్సిటీలో అర్హత ఉన్న ఉద్యోగులను పక్కనపెట్టి రిటైరైన వారికి ప్రసాదరెడ్డి అత్యున్నత పదవులు కట్టబెట్టారని పేర్కొన్నారు. రిటైర్డ్ ప్రొఫెసర్ కృష్ణమోహన్‌ను రిజిస్ట్రార్‌గా నియమించారని, డీన్‌లు, డైరెక్టర్లు వంటి ముఖ్యమైన పోస్టులను మాజీలకు ఇచ్చారన్నారు.

నోటిఫికేషన్ లేకుండా ఉద్యోగాలు

నోటిఫికేషన్ లేకుండా అడ్డదారిలో జరిగిన 150 మందిని ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టీస్ పేరుతో నియమించుకున్నారని గంటా శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఇలా..ఆయన సొంత డిపార్ట్‌మెంట్ కంప్యూటర్ సైన్స్‌లో 30 మందిని నియమించుకున్నారన్నారు. అలాగే స్పెషల్ ఎగ్జామ్ పేరుతో నీట్ పీహెచ్‌డీ కట్టబెట్టి పట్టా ఇచ్చారని, ఇది దౌర్భాగ్యమైన సంప్రదాయమని పేర్కొన్నారు. గాంధీ విగ్రహం పక్కనే వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని పెట్టించారని,వర్సిటీలో రాజకీయ విద్వేషాలు రెచ్చగొట్టారని పేర్కొన్నారు. సైన్ కాలేజీ ప్రొఫెసర్‌ను విధిగా లా కాలేజీ ప్రిన్సిపాల్‌గా నియమించారన్నారు.

మార్కెట్లలో ఆశీలు వేలం వాయిదా

జగదాంబ కూడలి, జూన్ 28: పూర్ణామార్కెట్‌తోపాటు పలు వాణిజ్య సముదాయాల ఆశీలు టెండర్ వేలం ప్రక్రియ వాయిదా పడింది. గ్రేటర్ పరిధిలోని జోన్- 4 కార్యాలయంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు ఈ వేలం ప్రారంభించారు. అయితే, సాయం త్రం వరకు టెండర్ కోసం పాడుదారులు ఎవరూ రాలేదు. జోన్- 4 పరిధిలోని వాణిజ్యసముదాయాలు, డైక్స్ ట్యాంక్, జగదాంబ, పాత బస్‌స్టాండ్ పేజ్-2, పద్మానగర్, సూర్యాబాగ్‌లోని వాణిజ్యసముదాయాలు, అంబేడ్కర్ కల్యాణ మండపం, రామకృష్ణా రైతుబజారు, రెల్లివీధి, చేపల మార్కెట్ల ఆశీలు వసూల కోసం వేలం కోసం నోటిఫికేషను జోనల్ కమిషనర్ ప్రసాదరావు విడుదల చేశారు. ఈ నేపథ్యంలో నిర్వహించిన వేలంలో సూర్యాబాగ్ సంబంధించి ఒక్కరు మాత్రమే వచ్చినట్టు జోనల్ అధికారులు తెలిపారు. ఇలా పాడుదారులు ఎవరూ పాల్గొనకపోవడం వెనుక వ్యూహం ఉన్నట్టు సమాచారం. వేలం వాయిదా పడితే ఆశీలు వసూలుకుగుటర్ అధికారుల కోట్ చేసిన సొమ్ము తగ్గించి మళ్లీ మరోసారి వేలం నిర్వహిస్తారని వ్యాపార వర్గాలు భావిస్తున్నాయి. అలాగేఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పటినుంచిపూర్ణామార్కెట్ ఆశీలు వసూలు బాధ్యత జీవీఎంసీ స్వయంగా చేపడుతోంది.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

డాబాగార్డెన్స్, జూన్ 28: ప్రభుత్వ పాఠశాలల్లోని నాణ్యమైన విద్యతో పాటు మౌలిక సదుపాయాలు, మధ్యాహ్నం భోజనం తదితర అవకాశాలు అందుబాటులో ఉన్నాయని జీవీఎంసీ 31 వార్డులోని ఆర్‌బీఎం యూపీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు హనుమంతు ప్రభాకర్ అన్నారు. శుక్రవారం వార్డు పరిధిలోని నేను బడికి పోతా.. ర్యాలీ నిర్వహించారు. డాబాగార్డెన్స్, రంగాస్ట్రీట్, శారదాస్ట్రీట్ తదితర ప్రాంతాల్లో సాగిన అవగాహన ర్యాలీలో విద్యార్థులు పాల్గొని ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యా ప్రాధాన్యాన్ని నినాదాలు చేశారు. పలు పథకాలు వర్తింపు తదితర అంశాలపై తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



వన్‌టౌన్ పోర్టు ఉన్నత పాఠశాలలో పిల్లలను చేర్పిస్తున్న విద్యా శాఖ అధికారులు

బడిఈడు పిల్లలకు పాఠశాలల్లో ప్రవేశాలు

పూర్ణామార్కెట్: ప్రభుత్వం అమలుచేస్తున్న నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా బడిఈడు పిల్లలను పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. రాష్ట్ర అసిస్టెంట్ సమగ్ర విద్యాభియాం (ఓఎస్‌డీ) కో-ఆర్డినేటర్ కల్యాణ శైలజ, అదనపు పథకం సమన్వయ కర్త బి. శ్రీనివాసరావు పలు వీధుల్లో ఇంటింటికి వెళ్లి విద్యకు గల ప్రాధాన్యం వివరించారు. తల్లిదండ్రులతో మాట్లాడి బడిఈడు కలిగిన పైమర్రీ పిల్లలను పాఠశాలల్లో చేర్పించారు. వన్‌టౌన్ ఉర్దూ పాఠశాలలో బాలికలను ముగ్గురును, పోర్టు ఉర్దూ బాలుర పాఠశాలల్లో ముగ్గురిని చేర్పించారు. క్వీన్ మేరీ బాలికల ఉన్నత పాఠశాలలో పది మంది చేర్పించారు. ప్రభుత్వపరంగా విద్యార్థులకు అందజేస్తున్న ప్రోత్సాహకాలను తల్లిదండ్రులకు వివరించడంతోపాటు తమ పిల్లలను బడికి పంపేందుకు ముందుకు వచ్చారని వారు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఏఎల్ఎస్ కో-ఆర్డినేటర్ బీశ్రీనివాసరావు, ఏపీవో అప్పలనాయుడు, అసిస్టెంట్ ఏఎంవో జి.లక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



డాబాగార్డెన్స్‌లో నేను బడికి పోతా..అవగాహనర్యాలీ

కనకమహాలక్ష్మికి మల్లెలార్చన



జగదాంబ కూడలి, జూన్ 28: కనకమహాలక్ష్మికి శుక్రవారం ఉదయం మల్లెలార్చన నిర్వహించారు. ఈ పూజలో ఉభయదాతలతోపాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అమ్మవారికి జలాభిషేకం జరిపారు. అలంకరించి, మల్లెమొగ్గలతో మహిమా పూజలు నిర్వహించారు.

బదిలీల కోసం రెవెన్యూలో ఎదురుచూపు

... 5వ పేజీ తరువాయి

తహసీల్దార్లు కొందరు వెనక్కి వచ్చే క్రమంలో కీలక పోస్టుల కోసం యత్నిస్తున్నారు. అయితే గతంలో పనిచేసిన పలువురు తహసీల్దార్లపై తీవ్ర ఆరోపణలు ఉన్నాయి. కొందరైతే వైసీపీ ప్రభుత్వంలో అధికార పార్టీ నేతలు, ఉన్నతాధికారులు చెప్పిన పనులు అడ్డగోలుగా చేశారు. శివారు ప్రాంతంలో ముగ్గురు, నలుగురు అక్రమాలకు పాల్పడ్డారు. ఒక తహసీల్దారు గత ప్రభుత్వ హయాంలో మూడు మండలాల్లో పనిచేసి నాయకుల ఆదేశాల మేరకు నడుచుకున్నారని రెవెన్యూ ఉద్యోగులే అంటున్నారు. మరో అధికారి ల్యాండ్‌పూలింగ్ సమయంలో వైసీపీ నేతలకు అనుకూలంగా రికార్డులో మార్చేశారు. మరో తహసీల్దారు ఒక రియల్టర్‌కు చెందిన వ్యవహారంలో తిరగేశారు. మరో తహసీల్దార్ ఎన్నికల నేపథ్యంలో పొరుగు జిల్లాకు వెళ్లి ఏపీఎసీకి దుబాయిడిని టెండర్‌తో భూములకు ఫ్రీ హోల్డ్ సర్టిఫికెట్లు జారీ చేశారు. శివారు మండలాల్లో పోస్టింగ్ కోసం అప్పుడే కొందరు అధికారులు పైరవీ చేస్తున్నారు. అయితే వైసీపీ ప్రభుత్వంలో అక్రమాలకు పాల్పడిన తహసీల్దార్లను పక్కనపెట్టాలని ప్రభుత్వం యోచిస్తోందని తెలిసింది. ఐదేవాయపడిగా కలెక్టర్లు, డిప్యూటీ కలెక్టర్ల బదిలీలు జరిగిన వెంటనే తహసీల్దార్ల బదిలీలు ఉంటాయని రెవెన్యూ వర్గాల్లో చర్చ సాగుతుంది.

పల్లా శ్రీనివాసరావుకు సముచిత స్థానం

» టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ నజీర్





పల్లా శ్రీనివాసరావును అభినందిస్తున్న నజీర్, నాయకులు

మహారాణిపేట, జూన్ 28: టీడీపీ రాష్ట్ర నూతన అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు సారథ్యంలో రాష్ట్రంలో పార్టీ మరింత బలపడుతుందని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ నజీర్ అన్నారు. శుక్రవారం మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడిగా పల్లా శ్రీనివాసరావు పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనను నజీర్ సన్మానించి అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులకు లోనుచేసినా నమ్ముకున్న సిద్ధాంతాలను వదిలిపెట్టకుండా విశాఖలో పార్టీ విజయపథంలో నడిపించారన్నారు. ఈ పోరాటాల నేపథ్యంలో పల్లాకు సముచిత ఉచితస్థానం లభించిందన్నారు.

కంచరపాలెం: రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడిగా శుక్రవారం మంగళగిరిలో బాధ్యతలు చేపట్టిన పల్లా శ్రీనివాసరావును నగర టీడీపీ నాయకులు కలిసి ఘనంగా సత్కరించారు. తమ అభిమాన నేత రాష్ట్ర అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భంగా నగరం నుంచి బయలుదేరి గురువారం మంగళగిరికి చేరుకున్నారు. శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన అనంతరం తెలుగు యువత అధికార జిల్లా ప్రతినిధి జోగ కోటి, మహేష్ కుమార్, విశాఖ పార్లమెంటరీ పార్టీ నాయు బ్రాహ్మణ సాధికార కమిటీ అధ్యక్షుడు దేవుపల్లి రమేష్, జిల్లా బీసీ సెల్ సెక్రటరీ బల్లపల్లి నరేష్ కుమార్, కరుణాకరన్ తదితరులు పల్లాను అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

పలు రైళ్లకు అదనపు కోచ్‌లు

విశాఖపట్నం, జూన్ 28: ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని పలు రైళ్లకు తాత్కాలికంగా అదనపు కోచ్‌లు జత చేస్తున్నట్టు సీనియర్ డీసీఎం కే.సందీప్ తెలిపారు. విశాఖ- కిరండోల్- విశాఖ పాసింజర్ రైళ్లకు (08551/085522) జూలై ఒకటి నుంచి ఆగస్టు ఒకటి వరకు ఒక థర్డ్ ఏసీ ఎకానమీ కోచ్ ఏర్పాటు. అలాగే, విశాఖ- గుణుపూర్-విశాఖ ప్రత్యేక పాసింజర్ రైళ్లకు (08522/08521) జూలై ఒకటి నుంచి 31వ తేదీ వరకు ఒక థర్డ్ ఏసీ, ఒక స్లీపర్ క్లాసు జత చేయనున్నారు. ఇక, నామినేటెడ్ రోజుల్లో నడిచే విశాఖ- నాందేడ్- విశాఖ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు (20811/20812) జూలై రెండు నుంచి ఆగస్టు ఒకటి వరకు ఒక థర్డ్ ఏసీ ఎకానమీ, ఒక స్లీపర్ క్లాసు కోచ్‌లు, విశాఖ- అమృతసర్ -విశాఖ హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు (20807/20808) జూ లై రెండు నుంచి ఆగస్టు మూడు వరకు ఒక థర్డ్ ఏసీ ఎకానమీ, ఒక స్లీపర్ క్లాసు కోచ్‌లు జత చేస్తున్నారు. భువనేశ్వర్-ఎస్ఎంవీ బెంగళూరు-భువనేశ్వర్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు (12845/ 12846) జూలై ఏడు నుంచి 29వ తేదీ వరకు ఒక థర్డ్ ఏసీ కోచ్; భువనేశ్వర్-చెన్నై సెంట్రల్ - భువనేశ్వర్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు (12830/12829) జూలై నాలుగు నుంచి 26వ తేదీ వరకు ఒక థర్డ్ ఏసీ కోచ్, భువనేశ్వర్-తిరుపతి-భువనేశ్వర్‌సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు (22871/22872) జూలై ఏడు నుంచి 29వ తేదీ వరకు ఒక థర్డ్ ఏసీ ఎకానమీ కోచ్ అందుబాటులోకి తీసుకువస్తున్నారు. అలాగే, భువనేశ్వర్ -పూణే- భువనేశ్వర్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు (22882/22881) జూలై రెండు నుంచి ఆగస్టు ఒకటి వరకు ఒక థర్డ్ ఏసీ ఎకానమీ కోచ్; భువనేశ్వర్ -పాండిచ్చేరి- భువనేశ్వర్ సూపర్‌ఫాస్ట్ రైళ్లకు (12892/ 12897) జూలై రెండు నుంచి 31వ తేదీ వరకు ఒక స్లీపర్ క్లాసు కోచ్, భువనేశ్వర్- రామేశ్వరం- భువనేశ్వర్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు (20896/20895) జూలై ఐదు నుంచి 28వ తేదీ వరకు ఒక స్లీపర్ క్లాసు కోచ్; పూరి- యశ్వంత్‌పూర్- పూరి గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు (22883/22884) జూలై ఐదు నుంచి 27వ తేదీ వరకు ఒక థర్డ్ ఏసీ కోచ్ జత చేయనున్నట్టు డీసీఎం పేర్కొన్నారు.

ఏయూ వీసీ అవుట్

... 5వ పేజీ తరువాయి

కూడా వీసీ ప్రసాదరెడ్డి నియమించు కున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అలా గే, నిబంధనలకు విరుద్ధంగా ఎయిడెడ్ ప్రాంతిల్లోని వీసీ వర్సిటీలోకి తీసుకువచ్చి కీలక విభాగాల్లో నియమించారు. అలాగే, రిటైర్డ్ పోలీస్ అధికారికి భారీగా వేతనాన్ని ఇచ్చి చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా నియమించుకున్నారు. అంతేగాకుండా పలువురు సంఖ్యలో సెక్యూరిటీ గార్డులను నియమించుకుని ప్రైవేటు సైన్యాన్ని ఏర్పాటుచేసుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అదే సమయంలో తనకు నచ్చని వారిని వక్రపకట్టేశారు. సుమారు 250 మంది గెస్ట్ ఫ్యాకల్టీని తొలగించేందుకు 28కిపైగా కోర్సులను రద్దు చేసేశారు.

పచ్చని చెట్లపై వేటు

జాతీయ స్థాయిలో వర్సిటీ ఖ్యాతిని మంటగలిపే మరో చర్యకు వీసీ ప్రసాదరెడ్డి పాల్పడ్డారు. వందలాది ఏళ్ల నాటి వృక్షాలు, పెద్ద వృక్షాలను తొలగించేశారు. అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయనే వంకతో వర్సిటీలోని పచ్చదనంపై వేటువేశారు. ఓ ప్రైవేటు వ్యక్తికి ఈ స్థలాన్ని కట్టబెట్టేందుకు యత్నించారని, అన్నివర్గాల నుంచి తీవ్ర స్థాయిలో విమర్శలు రావడంతో ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నారని వర్సిటీలోని అధికారులే చెబుతున్నారు.

విద్యార్థులకు దూరంగా వీసీ కార్యాలయం

విద్యార్థులకు ఏవైనా ఇబ్బందులు ఉంటే నేరుగా వీసీ కార్యాలయానికి వచ్చి చెప్పుకునే అవకాశాన్ని ప్రసాదరెడ్డి దూరం చేశారన్న విమర్శలు ఉన్నాయి. తాను బాధ్యతలు చేపట్టిన వెంటనే వీసీ కార్యాలయం వద్ద మూడంచెల భద్రతను ఏర్పాటు చేయించారు. ఎవరైనా లోపలకు వెళ్లాలంటే సెక్యూరిటీ అనుమతి తప్పనిసరి. గతంలో ఏదైనా ఇబ్బందులుంటే విద్యార్థి సంఘాల ఆందోళనలు నిర్వహించేవి. వీసీగా ప్రసాదరెడ్డి వచ్చిన తరువాత అటువంటి పరిస్థితి లేకుండా పోయింది. ఎన్ని ఇబ్బందులు ఉన్నా బయటకు చెప్పుకోలేని దుస్థితి నెలకొందని పలువురు విద్యార్థులు తెలిపారు.

పలువురు విద్యార్థులు వాపోతున్నారు. మరోవైపు అధికారుల పర్యవేక్షణలోపం కారణంగా వర్సిటీలో గంజాయి వంటి మత్తుపదార్థాల వినియోగం కూడా పెరిగిపోయింది. సాధారణంగా ప్రభుత్వాలు మారినా రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉన్నవారు ఈ తరహాలో రాజీనామా చేయడం ఎప్పుడూ లేదు. కానీ, వీసీ ప్రసాదరెడ్డి వ్యవహారశైలి అందుకు దారితీసిందన్న అభిప్రాయం సర్వత్రా వినిపిస్తోంది. వీసీ, రిజిస్ట్రార్ రాజీనామాతో విద్యార్థి, ఉద్యోగ సంఘాలు ఆనందాన్ని వ్యక్తంచేశాయి. సాయంత్రం ఐదు గంటలకు ఏయూ పరిపాలన భవనం ఆవరణలో బాణసంచా కాల్చి, స్వీట్లు పంచుకున్నారు. గడిచిన ఐదేళ్ల నుంచి వీసీ ప్రసాదరెడ్డి కబంధ హస్తాల్లో చిక్కుకున్న ఏయూలో ఎట్టకేలకు స్వేచ్ఛాయుత వాతావరణం ఏర్పడిందన్న ఆనందాన్ని వ్యక్తంచేశారు.

వీసీ పోస్టుకు ప్రయత్నాలు

ప్రసాదరెడ్డి రాజీనామా చేయడంతో ఏయూ వీసీ పోస్టు కోసం పలువురు సీనియర్ ప్రొఫెసర్లు ప్రయత్నాలు చేస్తున్నారు. మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వెలగపూడి ఉమామహేశ్వరరావు, శ్రీకాకుళం అంబేడ్కర్ వర్సిటీ వీసీగా పనిచేసి ప్రస్తుతం ఏయూలో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న ప్రొఫెసర్ కూన రాంజీ, ఏయూ ఫారిన్ అఫైర్స్ డీన్‌గా పనిచేస్తున్న ప్రొఫెసర్ ధనుంజయ్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న ప్రొఫెసర్ నరసింహారావు, ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న ప్రొఫెసర్ శశిభూషణ్, తదితరుల పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. ప్రస్తుతానికి ఇన్‌చార్జి వీసీని నియమించి, ఆ తరువాత పూర్తిస్థాయి వీసీ ఎంపిక కోసం సెర్చ్ కమిటీని ప్రభుత్వం వేయనున్నది.

గేమింగ్ డిజార్డర్

... 5వ పేజీ తరువాయి

సెల్‌ఫోన్ పట్టుకుని ఏవో మాట్లాడుతున్నట్టు కనిపించడం, స్కూల్/కళాశాలకు వెళ్లేం దుకు ఆసక్తి చూపించకపోవడం, గంటల తరబడి ఫోన్ పట్టుకుని ఉండడం, గుండగోళంగా కనిపించడం, తిండి, నిద్ర పట్ల ఆసక్తి తగ్గడం వంటి లక్షణాలు కనిపించినప్పుడు తల్లిదండ్రులు అప్రమత్తమై వైద్యులు వద్దకు తీసుకువెళ్లి కౌన్సెలింగ్ చేయించాలి. అలాగే వదిలేస్తే ఆందోళన, డిప్రెషన్ వంటివి పెరిగి మానసిక సమస్యలు తలెత్తుతున్నాయని వైద్యులు చెబుతున్నారు.

సాధారణ స్థితికి ఇలా..

ఈ లక్షణాలు కనిపించిన వారిని మానసిక వైద్యుల వద్దకు తీసుకువెళితే కౌన్సెలింగ్ ఇచ్చి సాధారణ స్థితికి తీసుక వస్తారు. అవసరమైతే సమస్య తీవ్రతను బట్టి కొందరికి మందులు కూడా వాడాల్సి ఉంటుంది. రోజువారీ ఆడే గేమింగ్ సమయాన్ని మెల్లగా తగ్గించుకుంటూ వచ్చి చివరికి పూర్తిగా మానం చేస్తారు. అలాగే గేమ్ ఆడేటప్పుడు కొందరికి రిలాక్స్ అవుతున్న ఫీలింగ్ కలుగుతుంది. అటువంటి ఫీలింగ్ కలిగించే మందులను ఇవ్వడం ద్వారా ఆ తరహా ఆటలు వైపు వెళ్లకుండా చేస్తారు. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్‌లో ఆడే వారికి ఈ తరహా ఇబ్బందులుతోపాటు లక్షలాది రూపాయలు పోగొట్టుకుంటుంటారని, కాబట్టి వారి పట్ల అందంతో మరింత అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

పెరుగుతున్న కేసులు

- డాక్టర్ ఎన్ఎస్ నిహాల్, మానసిక వైద్య నిపుణులు

ఆన్‌లైన్ గేమింగ్ డిజార్డర్ కేసులు ఈ మధ్యకాలంలో ఎక్కువ అవుతున్నాయి. స్కూల్స్ తెరిచిన తరువాత ఇటు వంటి కేసులు ఎక్కువగా వస్తున్నాయి. స్కూల్, కాలేజీలకు వెళ్లేందుకు ఇష్టపడకపోవడం, సెల్‌ఫోన్ ఇవ్వాలని తల్లిదండ్రులను వేధించడం చేస్తున్నారు. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల నమూనాలతో గుర్తించడం ద్వారా చిన్నారులను సాధారణ స్థితికి తీసుకువచ్చేందుకు అవకాశం ఉంది. అలస్యం అయితే మానసిక సమస్యగా మారిపోయే ప్రమాదం ఉంది.

సిటీ పోలీస్ కమిషనర్‌గా శంక బ్రత బాగ్చి

... 5వ పేజీ తరువాయి

ఇబ్బందులకు గురిచేశారన్న ఆరోపణలు ఉన్నాయి. పోలింగ్ జరిగిన తర్వాత కంచరపాలెం బర్మా కాలనీలో టీడీపీకి ఓటేశారనే కారణంతో ఒక కుటుంబంపై కొంతమంది దాడి చేస్తే, ఆ మరుసటి రాజకీయాలతో సం బంధం లేదని సీపీ తేల్చి పారేశారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదుచేయకుండా ఆ గొడవ వ్యక్తిగత కక్షల కారణమని సీపీ చెప్పడమే కాకుండా, డీసీపీ-2తో కూడా ప్రెస్‌మీట్ పెట్టించడంపై విమర్శలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో రవిశంకర్ అయ్యన్నార్ బదిలీ ఖాయమని అంతా భావించారు. ఎట్టకేలకు ప్రభుత్వం పలువురు సీపీలను బదిలీ చేసింది. నగర పోలీస్ కమిషనర్‌గా శంక బ్రత బాగ్చిని నియమించింది.

కొత్త సీపీది పశ్చిమబెంగాల్ ...

పశ్చిమ బెంగాల్‌కు చెందిన శంక బ్రత బాగ్చి 1996 బ్యాచ్ ఐపీఎస్ అధికారి. ఆయన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తొలుత జమ్మలమడుగు ఏఎస్పీ పనిచేశారు. ఆ తరువాత కడప ఓఎస్‌డీగా, హైదరాబాద్‌లో ఏపీఎస్పీ ఒకటవ బెటాలియన్ కమాండెంట్, నిజామాబాద్, కర్నూలు, గుంటూరు జిల్లాల ఎస్పీగా, గ్రేహౌండ్స్ డీఐజీగా, సీఐడీ డీఐజీగా పనిచేశారు. సీబీఐకి డిప్యుటేషన్‌పై వెళ్లి కోల్‌కతాలో ఆర్థిక నేరాల కేసులను దర్యాప్తు చేశారు. ఆ తరువాత ఢిల్లీలో సీబీఐ డీఐజీగా సేవలు అందించారు. రాష్ట్ర పునర్విభజన తరువాత విశాఖ రేంజ్ డీఐజీగా, ఏపీఎస్పీ ఇంటెలిజెన్స్ అడిషినల్ డైరెక్టర్ జనరల్‌గా, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, పర్సనల్ అండ్ అడ్మిన్, అగ్నిమాపక శాఖ ఏడీజీగా పనిచేసిన బాగ్చి ప్రస్తుతం శాంతి భద్రతల ఏడీజీగా ఉన్నారు.



బయటకు వేలాడుతున్న కనెక్షన్ బాక్సుల వైర్లు

ఘాట్ రోడ్డులో ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు

సింహాచలం, జూన్ 28 : సింహగిరి ఘాట్ రోడ్డులో విద్యుత్ స్తంభాలకు ఏర్పాటు చేసిన జంక్షన్ బాక్సులు ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ విషయమై భక్తులు దేవస్థానం అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేస్తున్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదు. ఘాట్‌లో అంధకారం ఉండడంతో గతంలో వీధి లైట్ల స్తంభాలకు కనెక్షన్లు ఇచ్చి, మరమ్మతుకు అనుకూలంగా నేల మట్టానికి సుమారు రెండు అడుగుల ఎత్తులో జంక్షన్ బాక్సులు అమర్చారు. ఏదైనా సమస్య వస్తే మరమ్మతు చేయడానికి వీలుగా బాక్సులకు ఉన్న కప్పులు తొలగించి, మళ్లీ యథావిధిగా అమర్చేలా ఏర్పాట్లు చేశారు. అయితే ఘాట్ రోడ్డులో ఉన్న సుమారు 50 స్తంభాలకు కనెక్షన్ బాక్సుల మూతలు తొలగించి, అలానే వదిలేశారు.దీంతో స్తంభం వద్ద విద్యుత్ వైర్లు బయటకు వేలాడుతూ ప్రమాదకరంగా కనిపిస్తున్నాయి. వర్షాకాలం నేపథ్యంలో వాహనదారులు వైర్లను తాకితే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి వైర్లను సరి చేయాలని భక్తులు కోరుతున్నారు.

అప్పన్నకు వైభవంగా నిత్య కల్యాణం

సింహాచలం, జూన్ 28 : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత నిత్య కల్యాణం శుక్రవారం వైభవంగా జరిపారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్టింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో కల్యాణ క్రతువు జరిపారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు ప్రసాదాలు అందజేశారు.

దుర్గాలమ్మకు కుంకుమ పూజలు



అమ్మవారికి కుంకుమార్చన చేస్తున్న మహిళలు

కొమ్మాది, జూన్ 28 : చంద్రంపాలెం జాతర గుట్టపై వెలసిన దుర్గాలమ్మ ఆలయంలో జేష్ట బహుళ సప్తమి పురస్కరించుకుని శుక్రవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం మహిళలతో సామూహిక కుంకుమార్చనలు, పుష్పార్చనలు జరిపారు.కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పిళ్లా సూరిబాబు, ఉపాధ్యక్షుడు అప్పారావు, కార్యదర్శి తాతారావు, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

కొమ్మాది, జూన్ 28 : వర్షాకాలం నేపథ్యంలో జీవీఎంసీ సిబ్బంది సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. ఈమేరకు శుక్రవారం ఆరో వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీతారాం రేవళ్లపాలెం శ్రీనివాసా పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు భోజనానికి ముందు సబ్బుతో చేతులను శుభ్రం చేసుకోవాలన్నారు. వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు, జీవీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **మహరాజ :** మెలోడి, శరత్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మీ (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), లిఖిత (శ్రీహరిపురం), తాతా సీతారామయ్య (పరవాడ), (తగరపువలస)
- **ప్రభుత్వ జూనియర్ కళాశాల :** రమాదేవి, వెంకటేశ్వర, నరసింహ (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక),
- **మనమే :** జగదాంబ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మినీమోహిని (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్ (తగరపువలస)
- **హరోం హర :** శ్రీరామ, శారద, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మోహిని (గాజువాక)
- **హనీమూన్ ఎక్స్‌ప్రెస్ :** రమాదేవి, శ్రీనరసింహ (గోపాలపట్నం), విశేష్ (గాజువాక)
- **ఒఎంజి :** శ్రీవెంకటేశ్వర, సంగం, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మోహిని (గాజువాక), రాములమ్మ (తగరపువలస)
- **భజే వాయు వేగం :** శ్రీవెంకటేశ్వర, మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 35,టమాటా 46, వంకాయలు (తెలుపు) 38, వంకాయలు (నలుపు) 38, బెండకాయలు 28, పచ్చిమిర్చి 84, కాకరకాయలు 48, బీరకాయలు 45, ఆనపకాయలు 18, కాలీఫ్లవర్ 40, క్యాబేజ్ 30, క్యారెట్ 38, దొండకాయలు 26, బంగాళా దుంపలు 32, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 110, అల్లం (పాతది) 150, బరబటి 60, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 75, గోరుచిక్కుడు 38, దోస కాయలు 18, వె ల్లుల్లి (పెద్దవి) 180, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 126, పొటల్స్ 32, కీరదోస 32, కాప్సికమ్ 70, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 40, చిలగడదుంపలు 38, కంద 60, దేముడు చిక్కుడు 84, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 28, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 33, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	530
విజయనగరం	534
శ్రీకాకుళం	534

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	120
ఫారం ధర	--	140
విత్ స్కిన్	--	250
స్కిన్‌లెస్	--	260

మరికొన్ని సిటీ వార్తలు పేజీ 10 లో..

షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాలు ఆపండి

అధికారులకు ఎమ్మెల్యే గంటా ఆదేశం



పింఛన్ల పంపిణీపై అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

భీమునిపట్నం, జూన్ 28 : పట్టణంలోని మెయిన్ రోడ్డులో నిర్మిస్తోన్న మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాలను నిలిపివేసి హోల్డ్‌లో ఉంచాలని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు జీవీఎంసీ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన లాల్ బహదూర్‌శాస్త్రి మునిసిపల్ కాంప్లెక్స్‌లో నిర్మాణంలో వున్న దుకాణ సముదాయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనరు కనకమహాలక్ష్మిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. మొత్తం 12 దుకాణాలు, వెనుక భాగంలో ఫిష్ మార్కెట్, కూరగాయల మార్కెట్ నిర్మాణాలకు రూ 1.5 కోట్లు జీవీఎంసీ మంజూరు చేసిందని ఇంజనీరింగ్ విభాగం సిబ్బంది తెలిపారు. 12 దుకాణాలకు పైభాగంలో కేరళలో రూఫ్ మాదిరిగా టైల్స్ వేస్తామని వివరించారు.దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ.. టైల్స్ ఏంటి, భవిష్యత్తులో పై అంతస్తు వేయాల్సి వస్తే పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. దీనికి అధికారుల నుంచి సరైన సమాధానం రాకపోవడంతో ఈవిధంగా ఎవరు డిజైన్ చేశారు..భవిష్యత్ ఆలోచన ఉండనవసరం లేదా అని అసహనం వ్యక్తం చేశారు. తక్షణమే పనులు నిలిపివేసి, నిర్మాణాలను హోల్డ్‌లో పెట్టాలని ఆదేశించారు. జీవీఎంసీ కమిషనరుతో తాను స్వయంగా మాట్లాడి, ఆలోచిస్తామని, అప్పటివరకూ అలానే ఉంచాలన్నారు.

రహదారుల విస్తరణ ఏమైంది!

భీమిలిలో తాను 2014లో ఎమ్మెల్యేగా ఉన్నపుడు మెయిన్ రోడ్, బీచ్ రోడ్, కొండ రోడ్ విస్తరణకు సర్వే చేశామని, అవి ఏమయ్యాయని ఎమ్మెల్యే పట్టణ ప్రణాళిక అసిస్టెంట్ సిటీ ప్లానర్ డి. శ్రీనివాస్‌ను ప్రశ్నించారు. ప్రస్తుతం విస్తరణ ఏదీ లేదని ఆయన చెప్పగా, రోడ్లు విస్తరించకపోవడం వల్ల ప్రజలు చాలా సమస్యలు ఎదుర్కొంటున్నారని, వెంటనే ఆ పనులు చేపట్టాలని ఎమ్మెల్యే సూచించారు. రోడ్ల విస్తరణ వల్ల కొందరు ఇబ్బంది పడొచ్చునని, వారికి నష్టపరిహారం, టీడీఆర్‌లు,ప్రత్యామ్నాయం ఆలోచిస్తామన్నారు. రెండు రోజుల్లో రోడ్ల విస్తరణపై అప్పట్లో జరిగిన సర్వే రిపోర్టులతో తన వద్దకు హాజరుకావాలని జీవీఎంసీ అధికారులను ఆదేశించారు. తర్వాత రహదారుల విస్తరణ వల్ల నష్టపోయేవారితో సమావేశం ఏర్పాటు చేసి రోడ్ల విస్తరణ ఆవశ్యకతను వివరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గంటా నూకరాజు, చిక్కాల విజయ్‌బాబు, 2వ వార్డు కార్పొరేటర్ గాడు చిన్నికుమారిలక్ష్మి, 3వ వార్డు టీడీపీ ప్రధాన కార్యదర్శి గొలగాని నరేంద్రకుమార్, మారోజు సంజీవ్‌కుమార్, కొక్కిరి అప్పన్న, కనకల అప్పలనాయుడు, వియ్యపు పోతురాజు, ఆవాల సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా పింఛన్ల పంపిణీ

నియోజకవర్గంలో సోమవారం నుంచి జరిగే పింఛన్ల పంపిణీని పక్కాగా చేపట్టాలని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదేశించారు. శుక్రవారం ఆయన పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో పింఛన్ల పంపిణీపై అధికారులు, ముఖ్య నాయకులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 1న తెల్లవారుజామున 6 గంటల నుంచే సచివాలయ సిబ్బందితో పింఛన్ల పంపిణీ ప్రారంభం కావాలన్నారు. ప్రతి లబ్ధిదారునికి ఇంటి వద్దకే పింఛను సొమ్ము అందేలా శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఎన్నికల హామీ మేరకు పెంచిన పింఛనుతో పాటు ఎరియర్స్ కలిపి మొత్తం సొమ్ము అందించాలని చెప్పారు.ఈ సమావేశంలో ఆర్డీవో భాస్కర్‌రెడ్డి, జీవీఎంసీ 1, 2 జోన్‌ల జడ్సీలు కనకమహాలక్ష్మి, శైలజావల్లీ, సింహాచలం ఏరియా జోనల్ కమిషనరు, భీమిలి ఎంపీడీవో జానకి, పద్మనాభం ఈవోపీఆర్డీ రాధ, భీమిలి ఏసీపీ శ్రీనివాసరావు, నియోజకవర్గ నాయకులు చిక్కాల విజయ్‌బాబు, గంటా నూకరాజు, కార్పొరేటర్ గాడు చిన్నికుమారిలక్ష్మి, భీమిలి మండల టీడీపీ అధ్యక్షుడు రాజు, పాసి నరసింగరావు, పిట్టా సురేష్, తమ్మిన సూరిబాబు, చెట్టుపల్లి గోపి పాల్గొన్నారు.



జాబ్‌మేళాలో మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ విజయబాబు

వీఎస్ కృష్ణ కళాశాలలో జాబ్ మేళా

మద్దిలపాలెం, జూన్ 28 : డాక్టర్ వీఎస్ కృష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో టెక్ మహీంద్ర సంస్థ నిర్వాహకులు శుక్రవారం మెగా జాబ్‌మేళా నిర్వహించారు. రెండు రోజుల పాటు మేళా చేపట్టనున్నారు. తొలి రోజు 1220 మంది విద్యార్థులు మేళాలో పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ విజయబాబు మేళాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేసపువానిపాలెం టెక్ మహీంద్ర బ్రాంచ్‌లో బీపీవో ఉద్యోగాల నియమాకం కోసం ఈ మేళా చేపట్టారన్నారు. శనివారం కూడా మేళాలో పాల్గొన్న వారికి ఇంటర్వ్యూలు నిర్వహించి, ఎంపికలు చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టెక్ మహీంద్ర హెచ్‌ఆర్ గీతాంజలి పాటిల్, జేకేసీ సమన్వయకర్త జి. శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

'విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలి'

సిరిపురం, జూన్ 28 : విశాఖ స్టీల్‌ప్లాంట్ ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని పీఓడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. లక్ష్మి డిమాండ్ చేశారు. శుక్రవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద కార్మిక, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రం, రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన నూతన ప్రభుత్వాలు స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిలుపుదలను ఆపాలన్నారు. కార్యక్రమంలో పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు ఎస్.వెంకటలక్ష్మి, ఉపాధ్యక్షురాలు బాల నాగమ్మ, రోహిణి, ఎల్. వరలక్ష్మి, నాగమణి, జయ, కొండమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

పెట్రోలింగ్ వాహనాన్ని పునరుద్ధరించాలి

సాగర్‌నగర్, జూన్ 28 : సాగర్‌నగర్, తీర ప్రాంత గ్రామాల్లో బీచ్ పెట్రోలింగ్ వాహన సేవలను పునరుద్ధరించాలని స్థానికులు కోరుతున్నారు. వాహనం గ్రామాల్లోకి రాకపోవడంతో రాత్రి వేళ శాంతి భద్రతలు క్షీణిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సకాలంలో పోలీసు సేవలందేందుకు బీచ్ పెట్రోలింగ్ వాహనాలు ఉపయోగపడేవి. కాలనీలో శాంతిభద్రతలు అదుపులో ఉండేవి. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత బీచ్ పెట్రోలింగ్ వాహనాలను కేవలం బీచ్ రోడ్డుకే పరిమితం చేయడంతో వాటి సేవలు పేరుకే అన్న చందాన మారాయి. ఆర్కే బీచ్ నుంచి సాగర్‌నగర్ బీచ్ రోడ్డు మీదుగా తిమ్మాపురం వరకు వాహనం వచ్చి వెళ్లిపోతోంది. దీనివల్ల ప్రజలకు పెద్దగా ఉపయోగం లేదు. దీంతో ఆయా గ్రామాల్లో అల్లరి మూకల ఆగడాలు, గంజాయి బ్యాచ్‌లు, చిల్లర దొంగల హల్‌చల్ ఎక్కువైంది. ఆరు బయట ఏ వస్తువు ఉంచినా తెల్లారేసరికి మాయమవుతున్నాయని స్థానికులు గగ్గోలు పెడుతున్నారు. బీచ్ పెట్రోలింగ్ వాహనాలు గ్రామాల్లో తిరిగినప్పుడు ఇటువంటి పరిస్థితులు అదుపులో వుండేవి. నగర పోలీసు కమిషనర్ స్పందించి తీర గ్రామాల్లో పోలీస్ నిఘా పెంచేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పోస్టుమాస్టర్లు బాధ్యతల స్వీకరణ

తగరపువలస, జూన్ 28 : తగరపువలస నుంచి భీమిలి బదిలీ అయిన బ్రాంచి పోస్టుమాస్టర్ బోని చంద్రశేఖర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన స్థానంలో తగరపువలస వచ్చిన ఆదినారాయణకు చార్జి అప్పగించారు. పోస్టుమాస్టర్‌గా పనిచేసిన చంద్రశేఖర్ పోస్టాఫీసును విశాఖ డివిజన్‌లో ప్రథమ స్థానంలో నిలిపారని పలువురు అభినందించారు.

పింఛన్ల పంపిణీలో జాప్యం వద్దు

సచివాలయ ఉద్యోగులతో కూటమి నేతల సమావేశం

పెదవాల్తేరు, జూన్ 28 : సీబీఐ డౌన్ సచివాలయంలో 156, 160, 161, 162, 163 వార్డుల సచివాలయ ఉద్యోగులతో 21వ వార్డు టీడీపీ అధ్యక్షుడు పీతల అమరేంద్ర శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సోమవారం నుంచి పెంచిన పింఛన్ పంపిణీ చేయనున్నట్టు చెప్పారు. ఈమేరకు సచివాలయాల ఉద్యోగులు ఏర్పాట్లు చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు పీతల అవినాష్ యాదవ్, నక్కా వినయ్, తదితరులు పాల్గొన్నారు.

వెంకోజీపాలెం : తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఆదేశాల మేరకు సింహాద్రిపురంలోని టీడీపీ కార్యాలయం వద్ద సచివాలయాల అడ్మిన్‌లు, కార్యదర్శులు, ఇతర సిబ్బందితో కూటమి నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా 15వ వార్డు టీడీపీ అధ్యక్షుడు బుగత సత్యనారాయణ మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలులో సచివాలయం సిబ్బంది తమతో కలిసి పని చేయాలని చెప్పారు. పథకాల అమలులో ఎటువంటి లోపాలు తలెత్తినా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో 15వ వార్డు టీడీపీ ప్రధాన కార్యదర్శి మళ్ల రవికుమార్, సీహెచ్ గోవింద్, జనసేన 15వ వార్డు అధ్యక్షురాలు యడ్ల కళ, బీజేపీ 15వ వార్డు అధ్యక్షుడు కనకాల పాపారావు, కర్రి గౌరి, సన్యాసమ్మ, వరలక్ష్మి పాల్గొన్నారు.

ఆరిలోవ : పింఛన్ల పంపిణీలో ఇబ్బందులు లేకుండా చూడాలని పదో వార్డు కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మి రాజశేఖర్ తెలిపారు. ఎమ్మెల్యే వెలగపూడి ఆదేశాల మేరకు ఆమె సచివాలయం సిబ్బందితో వార్డులోని పార్టీ కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సోమవారం ఎట్టి పరిస్థితుల్లోనూ పింఛన్ల పంపిణీ పూర్తి కావాలన్నారు. సమావేశంలో పదో వార్డు టీడీపీ అధ్యక్షుడు అప్పలనాయుడు, జనసేన అధ్యక్షుడు బండి రాజా రమేష్, బీజేపీ అధ్యక్షుడు దొంతల రమణ, క్లస్టర్ ఇన్‌చార్జి మద్దిల రాజేష్ పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉపాధ్యాయినికి సన్మానం

భీమునిపట్నం, జూన్ 28 : పట్టణంలోని నెహ్రూ రోడ్‌లో వున్న జీవీఎంసీ హైస్కూల్‌లో సోషల్ స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేసిన సత్యాల సుజాత కుమారి విద్యాభివృద్ధికి చేసిన సేవలను పలువురు కొనియాడారు. శుక్రవారం పాఠశాలలో హెచ్‌ఎం సీహెచ్ సింహాచలం అధ్యక్షతన సుజాత పదవీ విరమణ, అభినందన సభ జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రఘు వర్మ, మైలపల్లి లక్ష్మణరావు, కంటుభుక్త ముత్యాలరావు తదితరులు పాల్గొని ఆమె సేవలను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఏబీ చర్చి పాస్టర్, చర్చి సంఘం కార్యదర్శి లివింగ్ స్టన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేటి నుంచి సురభి నాటకాలు

డాబాగార్డెన్స్, జూన్ 28 : రంగసాయి నాటక సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 29 నుంచి మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో వారం రోజుల పాటు సురభి నాటకోత్సవాలు నిర్వహించనున్నట్టు వ్యవస్థాపకులు బాదంగీర్ సాయి తెలియజేశారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతిరోజూ సాయంత్రం 6 నుంచి 9 వరకు జరిగే కార్యక్రమంలో భాగంగా 29న మాయాబజార్, 30న భక్తప్రహ్లాద, జూలై ఒకటిన లవకుశ, 2న భూకైలాస్, 3న పాతాళభైరవి, 4న శ్రీకృష్ణ లీలలు, 7న మాయాబజార్ నాటకాలను ప్రదర్శిస్తామన్నారు. నిర్వాహకులుగా బాదంగీర్ సాయి, ఎస్. నాగేశ్వరరావు వ్యవహరిస్తారన్నారు. ప్రేక్షకులు ఈ నాటకాలను ఉచితంగా తిలకించే అవకాశం కల్పిస్తున్నామని చెప్పారు.

1 నుంచి సీపీఐ రాష్ట్ర మహాసభలు

ఆరిలోవ, జూన్ 28 : నగరంలోని మురళీనగర్‌లో జూలై 1 నుంచి మూడు రోజుల పాటు జరిగే సీపీఐ రాష్ట్ర సమితి సమావేశాలను ప్రజలు విజయవంతం చేయాలని పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు, తూర్పు నియోజకవర్గ కార్యదర్శి ఎస్‌కే రెహమాన్ విజ్ఞప్తి చేశారు.శుక్రవారం ఆయన పార్టీ నాయకులతో కలిసి ఆరిలోవలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమావేశాల్లో ఎన్నికల అనంతర పరిణామాలు, పార్టీ భవిష్యత్తు కార్యకలాపాలపై చర్చిస్తామన్నారు. సభలకు జాతీయ నాయకులతో పాటు రాష్ట్రం నుంచి 200 మంది ముఖ్య నేతలు హాజరుకానున్నట్టు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమితి సభ్యురాలు దేవుడమ్మ, లక్ష్మణరావు, కాసుబాబు, చిరంజీవి, బి. పుష్పలత, తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీకి సన్నాహాలు

మధురవాడ, జూన్ 28 : జీవీఎంసీ 5, 6, 7 వార్డుల సచివాలయ సిబ్బంది పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఈనెల నుంచి లబ్ధిదారులకు రూ. 4 వేల చొప్పున పింఛన్ అందించనుంది. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సోమవారం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. అదే రోజు ఆనందపురం, భీమిలి, పద్మనాభం, తగరపువలస ప్రాంతాల్లోని లబ్ధిదారులకు కూడా ఇంటింటికి వెళ్లి సచివాలయ సిబ్బంది పింఛన్ అందజేయనున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు లబ్ధిదారులకు పింఛన్ నగదు రూ. 3 వేలతో పాటు గత మూడు నెలలకు వెయ్యి రూపాయల చొప్పున అంటే మొత్తం రూ.7000 ఇవ్వనున్నారు.

మరమ్మతుతో ఆర్‌ఓ ప్లాంటు

మధురవాడ, జూన్ 28 : మధురవాడ శిల్పారామంలో పర్యాటకుల తాగునీటి సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ఆర్‌ఓ ప్లాం టు మరమ్మతులతో మూలకు చేరింది. దీంతో శిల్పారామానికి వస్తున్న సందర్శకులు తాగునీటికి ఇబ్బంది పడుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో దాహం తీర్చుకోవడానికి వాటర్ బాటిళ్ల కొనుగోలు చేస్తున్నారు. ఐదేళ్ల కిందట పర్యాటకుల దాహ ర్తి తీర్చడానికి శిల్పారామంలో వాటర్ ప్లాంటు ఏర్పాటు చేశారు. ఇది కొన్నేళ్లు బాగానే పనిచేసింది. తరువాత నిర్వహణ లోపం వల్ల మూలన పడింది. దీంతో పర్యాటకులుతో పాటు శిల్పారామం సిబ్బందికి తాగునీటికి ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయమై శిల్పారామం పరిపాలనాధికారి విశ్వనాథరెడ్డిని వివరణ కోరగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లామని త్వరలోనే ప్లాంటుకు మరమ్మతులు చేస్తామని చెప్పారు.

అనంతవరంలో విత్తనాలు పంపిణీ



అనంతవరంలో వరి విత్తనాలు పంపిణీ చేస్తు టీడీపీ నాయకులు

పద్మనాభం (రూరల్), జూన్ 28 : రైతుల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని భీమిలి ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ గొర్లెపాటి పెద ఎర్రినాయుడు అన్నారు. శుక్రవారం ఆయన అనంతవరం రైతు భరోసా కేంద్రంలో రైతులకు రాయితీపై వరి విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న పథ కాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎస్. వెంకటరావు, తాతాజీ. కె. అప్పారావు, అప్పల సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నారుమడుల తయారీలో రైతులు

పద్మనాభం (రూరల్), జూన్ 28 : మండలంలో కొద్ది రోజులుగా పడుతున్న వర్షాలకు రైతులు నారు మడులు తయారు చేసే పనిలో నిమగ్నమయ్యారు. వారం రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో చెరువులు, పంట కాలువల్లో నీరు చేరింది. దీంతో మద్ది, అనంతవరం, కొవ్వాడ, పెంట, గంధవరం, రెడ్డిపల్లి, పాండ్రంగి, చిన్నాపురం గ్రామాల్లోని రైతులు ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్నారు. ఆయా గ్రామాల్లో వరి సాగుకు నారు మడులు తయారు చేస్తున్నారు. కాగా అన్ని రైతుభరోసా కేంద్రల్లోనూ శ్రీకాకుళం సన్నాలు, ఆర్‌జీఎల్ 2537, సాంబమసూరి, శ్రీధృతి ఎంటీయూ 1121, వేరు శెనగ విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచామని ఏఓ ఎంవీ చలం తెలిపారు.

రైతు బజారులో కిలో టమాటా రూ. 46

ఎంవీపీ కాలనీ, జూన్ 28 : టమాటా ధర బాగా పెరిగిన నేపథ్యంలో మార్కెటింగ్ శాఖ ధర నియంత్రణకు చర్యలు చేపట్టింది. ఈమేరకు ఎంవీపీ కాలనీ రైతు బజారులో వినియోగదారులకు కిలో టమాటా రూ. 46 లకు విక్రయిస్తున్నారు. శుక్రవారం మదనపల్లిలో కొనుగోలు చేసిన మూడు టన్నుల టమాటాను రైతు బజారులో విక్రయించారు. వినియోగదారులకు ఒకటి లేదా రెండు కిలోలు మాత్రమే ఇస్తున్నారు. ధర అదుపులోకి వచ్చేవరకూ బయటి నుంచి టమాటాలు తీసుకువచ్చి విక్రయించడానికి మార్కెటింగ్ శాఖ ఏర్పాట్లు చేస్తోంది.

సమావేశ మందిరం పనులు పరిశీలన

భీమునిపట్నం, జూన్ 28 : పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో అసంపూర్తిగా ఉన్న మీటింగ్ హాల్ నిర్మాణాన్ని తక్షణమే పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని టీడీపీ నాయకుడు, జడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు తెలిపారు. శుక్రవారం ఆయన ఆ భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భవన నిర్మాణానికి హెచ్‌పీసీఎల్ కంపెనీ రూ. 40 లక్షల సీఎస్‌ఆర్ నిధులు మంజూరు చేస్తామన్నారన్నారు. అలాగే సీఎండీఎఫ్‌గా మరో రూ. 50 లక్షలు మంజూరు చేశారని తెలిసిందన్నారు. అయినా భవన నిర్మాణం ఎందుకు అసంపూర్తిగా నిలిచిపోయిందో తెలియడం లేదని చెప్పారు. విషయాన్ని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళతామని తెలిపారు. ఆయనతో పాటు సింగనబంధ సర్పంచ్ నారాయణ, టీడీపీ నాయకులు గాడు తాతినాయుడు, గుడ్డాల ఎల్లయ్య , తదితరులు పాల్గొన్నారు.

ఆనందపురంలో 'విద్యా ప్రవేశం' ర్యాలీ

ఆనందపురం, జూన్ 28 : ఆనందపురం ప్రాథమిక పాఠశాల విద్యార్థులు విద్యా ప్రవేశం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ గంగరాజు మాట్లాడుతూ విద్యా ప్రవేశం కార్యక్రమం ఈనెల 24 నుంచి వచ్చే నెల 25 వరకు జరుగుతుందన్నారు. తల్లిదండ్రులు ఐదేళ్లు నిండిన పిల్లలను విధిగా పాఠశాలల్లో చేర్పించాలన్నారు. కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా పని చేస్తున్న ప్రభుత్వ పాఠశాలలను వినియోగించుకోవాలన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో మానవహారం చేపట్టారు.

గంభీరంలో కేంద్ర బృందం పర్యటన

ఆనందపురం, జూన్ 28 : మండలంలోని పలు గ్రామాల్లో ఎనీమియా ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా కేంద్ర బృందం శుక్రవారం పర్యటించింది. బోయపాలెం, గంభీరం, చందక గ్రామాల్లో పర్యటించి వైద్య, ఐసీడీఎస్ శాఖల పనితీరును పరిశీలించారు. ముందుగా బోయపాలెం ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. రక్తహీనతను నివారించే ఐరన్ మాత్రలు ఇస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అక్కడి వైద్య సిబ్బంది, విద్యా శాఖ సిబ్బందితో మాట్లాడి హిమోగ్లోబిన్ పరీక్షల రికార్డులు పరిశీలించారు. అనంతరం గంభీరం హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్‌ను పరిశీలించి గర్భిణి, బాలింత, కౌమార బాలికలకు రక్తహీనత రాకుండా తీసుకునే చర్యలు గురించి అడిగి తెలుసుకున్నారు.కేంద్రంలో ఉన్న బాలింతలను సౌకర్యాలు, మందుల సరఫరాపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎకనామిక్ గ్రోత్ కేంద్ర కార్యాలయం అధికారి డాక్టర్ పూజిత, ఎనీమియా ముక్త్ భారత్ జిల్లా ప్రోగ్రాం అధికారి సమత, డాక్టర్ హీనా,ఆనందపురం పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం. గంగునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

నోట్ పుస్తకాలు పంపిణీ

పద్మనాభం, జూన్ 28 : మండలంలోని కోరాడ గ్రామంలో భీమిలి ఎస్‌ఓఎస్ సంస్థ సభ్యులు శుక్రవారం 85 మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. మండల పరిషత్, జిల్లా పరిషత్ పాఠశాలల్లో చదువుతున్న ఆ గ్రామానికి చెందిన విద్యార్థులకు వీటిని అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ పి. రమణ మాట్లాడుతూ క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్యను అందజేస్తున్న ప్రభుత్వ పాఠశాలలకు తల్లిదండ్రులు పిల్లలను పంపించాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మణరావు, ఎస్‌ఓఎస్ మహిళా బలోపేతం ప్రాజెక్టు ఇన్‌చార్జి దుర్గరాజు పాల్గొన్నారు.

టీడీపీ మండల అధ్యక్ష పదవికి ఆరుగురు పోటీ

ఆనందపురం, జూన్ 28 : తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్ష పదవికి ఆరుగురు పోటీ పడుతున్నారు. గతంలో మండలాధ్యక్షుడిగా ఉన్న శొంఠ్యాం గ్రామానికి చెందిన బొద్దప్ప శ్రీను సార్వత్రిక ఎన్నికలకు ముందు వైసీపీలో చేరడంతో అధ్యక్ష పదవి ఖాళీ ఏర్పడింది. ఎన్నికల్లో కూటమి విజయం తరువాత ఈ పదవికి తీవ్రమైన పోటీ నెలకొంది. ఆనందపురం గ్రామానికి చెందిన మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు మీసాల సత్యన్నారాయణ, గండిగుండం గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు గంట్రెడ్డి రమేష్,మామిడిలోవ సర్పంచ్ బలిరెడ్డి మల్లికార్జునరావు, తర్లువాడ సర్పంచ్ బీఆర్‌బీ నాయుడు, గంభీరం మాజీ సర్పంచ్ వానపల్లి ముత్యాలరావు, బిపికళ్లాలు మాజీ సర్పంచ్ బంటుపల్లి శ్రీనివాసరావు పోటీ పడుతున్నారు. మీసాల సత్యన్నారాయణ వైస్ ఎంపీపీగా పని చేయడంతో పాటు పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు ఎనలేని సేవ చేశారు. దీంతో ఎలాగైనా అధ్యక్ష పదవి తనకే దక్కుతుందని ధీమాగా ఉన్నారు.గంట్రెడ్డి రమేష్ తండ్రి స్వామినాయుడు ఆ పంచాయతీకి మాజీ సర్పంచ్‌గా, ఎంపీటీసీగా, ఉడా డైరెక్టర్‌గా సేవలందించడంతో పాటు పార్టీని నమ్ముకుని మండల సీనియర్ నాయకుడిగా గుర్తింపు పొందారు. ఆయన వెంటే రమేష్ కూడా పార్టీ అభివృద్ధికి ఎంతో సేవచేశారు. ఆయనకు అధ్యక్ష పదవి అప్పగించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. అలాగే బీఆర్‌బీ నాయుడు, బలిరెడ్డి మల్లికార్జునరావు, వానపల్లి ముత్యాలరావు, బంటుపల్లి శ్రీనివాసరావు కూడా పోటీలో ఉన్నారు.

సెయిల్ డైరెక్టర్‌ను కలిసిన ఉక్కు నేతలు



సెయిల్ డైరెక్టర్‌తో ఉక్కు నేతలు కేఎస్ఎన్ రావు, తదితరులు

ఉక్కుటౌన్‌షిప్, జూన్ 28: సెయిల్ ఇండిపెండెంట్ డైరెక్టర్ ఎస్.కాశీవిశ్వనాథరాజును శుక్రవారం నగరంలో విశాఖ స్టీల్‌ప్లాంట్ గుర్తింపు యూనియన్ అధ్యక్షుడు కేఎస్ఎన్ నేతృత్వంలో నాయకులు కలిశారు. సెయిల్‌లో స్టీల్‌ప్లాంట్‌ను విలీనం చేయాలని కోరారు. ఈ మేరకు కేంద్ర ఉక్కు శాఖా మంత్రి కుమారస్వామికి వినతిపత్రం అందజేసిన సందర్భంగా అభినందనలు తెలిపారు. స్టీల్‌ప్లాంట్‌కు అన్నివిధాలా న్యాయం చేస్తామని డైరెక్టర్ హామీ ఇచ్చినట్టు వారు వివరించారు. డైరెక్టర్‌ను కలిసిన వారిలో బి.కామేశ్వరరావు, డొక్కా నరసింగరావు, చీకటి శ్రీనివాసరావు, గణపతివర్మ ఉన్నారు.